జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



విజయవాడ నగరంలో
రాఘవయ్య పార్క్ వద్ద గల
మన ఆఫీస్ లో
స్నేహా గ్రూప్ సభ్యులకు
సమావేశాలు
నిర్వహించుకునేందుకు
40 మంది వరకు
అవకాశం కల్పించబడును
వివరాలకు ఈ క్రింది నెంబర్లలో సంప్రదించగలరు
9000621111, 9440137451





సంపుటి 15 సంచిక 224 విశాఖపట్నం | శనివారం 30 ఏప్రిల్ 2022 | 8 పేజీలు | వెల : 5.00




## బీటెక్ విద్యార్థిని రమ్య హత్యకేసులో సంచలన తీర్పు

### నిందితుడు శశికృష్ణకు ఉరిశిక్ష

గుంటూరు: గుంటూరులో గత ఏడాది ఆగస్టు 15న జరిగిన బీటెక్ విద్యార్థిని నల్లపు రమ్య (20) హత్య కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడు శశికృష్ణకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. సుదీర్ఘ వాదనల తర్వాత కోర్టు ఉరిశిక్ష విధించింది. 28 మంది సాక్షుల నుంచి వాంగూల్మం సేకరించింది. 9 నెలల్లోనే విచారణ పూర్తిచేసి కోర్టు.. తీర్పునిచ్చింది. నేర నిర్ధారణలో సీసీ ఫుటేజీ కీలకంగా మారిందని, సెక్షన్ 302 కింద ఉరిశిక్షను కోర్టు ఖరారు చేసిందని ప్రభుత్వం న్యాయవాది తెలిపారు. ప్రత్యక్ష సాక్షులతో పాటు డిజిటల్ ఎవిడెన్స్ కీలకంగా మారాయని ఎస్పీ తెలిపారు. పోలీసులు ప్రత్యేక శ్రద్ధతో కేసును పరిష్కరించార న్నారు. తనను ప్రేమించడంలేదని వట్టిచెరుకూరు మండలం ముట్లూరుకు చెందిన కుంచాల శశికృష్ణ (19) ఉదయం 9.40కి టిఫిన్ తీసుకురావడం కోసం ఇంటి నుంచి బయటకు వచ్చిన రమ్యతో

(మిగతా 2లో..)

### పోలీసు శాఖకు అభినందనలు



విద్యార్థిని రమ్య హత్య కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును స్వాగతిస్తున్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. "ఈ కేసు విషయంలో వేగంగా దర్యాప్తు పూర్తిచేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ శాఖకు అభినందనలు" అని సీఎం వైఎస్ జగన్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. గుంటూరులో గత ఏడాది ఆగస్టు 15న జరిగిన బీటెక్ విద్యార్థిని నల్లపు రమ్య (20) హత్య కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడు శశికృష్ణకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. సుదీర్ఘ వాదనల తర్వాత కోర్టు ఉరిశిక్ష విధించింది.

## జీఈఆర్ గణనీయంగా పెరగాలి: జగన్

### ఉన్నత విద్యపై సమీక్ష.. సీఎం జగన్ కీలక ఆదేశాలు



అమరావతి: తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఉన్నత విద్యపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ( జీఈఆర్) గణనీయంగా పెరగాలని, అందుకే విద్యాదీవెన, వసతి దీవెన అమలు చేస్తున్నామన్నారు. "పూర్తిస్థాయి ఫీజు రియింబర్స్ మెంట్‌ను విద్యా దీవెన కింద అమలు చేస్తున్నాం. వసతి ఖర్చులూ పెట్టుకోలేక చదువులు ఆపేసే పరిస్థితులు ఉండకూడదని, వసతి దీవెన తీసుకు వచ్చామని" ఆయన అన్నారు.

సీఎం జగన్ ఏమన్నారంటే

గతంలో కన్నా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో( జీఈఆర్) పెరిగిన మాట వాస్తవమే, కాని, దీంతో మనం సంతృప్తి చెందకూడదు. జీఈఆర్ గణనీయంగా పెరగాలి. కచ్చితంగా దీన్ని లక్ష్యంగా పెట్టుకోవాలి. జీఈఆర్ 80శాతానికి పైగా ఉండాలి. ఉద్యోగాలను కల్పించే చదువులు దిశగా కోర్సులు ఉండాలి. ఇప్పుడున్న కోర్సులకు సంబంధించి అనుబంధకోర్సులు, ప్రత్యేక కోర్సులు తీసుకురావాలి. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచేందుకు వీలుగా ఇంగ్లిషుపై పట్టు, ప్రావీణ్యం విద్యార్థులకు రావాలి. వీటిపై అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలి. జీఆర్ఈ, జీ మ్యాట్ పరీక్షలపైన కూడా విద్యార్థులకు మంచి శిక్షణ ఇవ్వాలన్న సీఎం ఇంతకుముందులా కాకుండా ఫీజురీయింబర్స్ మెంట్, వసతి దీవెనలను ఒక పిల్లాడికే పరిమితం చేయడంలేదు. ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నారో, అంతమందికీ విద్యాదీవెన, వసతి దీవెన ఇస్తున్నాం. ఇంతకుముందు చదివించే స్తోమత లేక, చాలామంది అబ్బాయి చదువుకుంటే చాలు అని.. అమ్మాయిలను పై చదువులకు పంపలేని పరిస్థితులు ఉండేవి. అలాంటి పరిస్థితులను పూర్తిగా తీసేయడానికి ఇంట్లో ఉన్న పిల్లలు అందరికీ కూడా విద్యాదీవెన, వసతి దీవెన వర్తింపు చేస్తున్నాం. రాష్ట్రంలో వెనుకబడ్డ ప్రాంతాల్లో అమ్మాయిలు చదువులకు దూరమవుతున్నారు.. వీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వారిలో చైతన్యం తీసుకురావాలి. కర్నూలు పశ్చిమ ప్రాంతం, చిత్తూరు, ప్రకాశం జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సీఎం అన్నారు.

## ఏపీలో పరిస్థితులు అధ్వాన్నం: మంత్రి కేటీఆర్



హైదరాబాద్: టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఏపీ పరిస్థితులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్, మాదాపూర్ హైటెక్స్‌లో జరుగుతున్న క్రెడాయ్ ప్రాపర్టీ షోను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏపీలో కరెంట్, నీటి సౌకర్యం లేదని, రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉందన్నారు. ఈ విషయం ఏపీకి వెళ్లొచ్చిన తన స్నేహితులు చెబుతున్నారన్నారని, ఏపీలో ఉంటే నరకంలో ఉన్నట్లు ఉందని చెప్పారన్నారు. అనుమానం ఉంటే.. ఎవరైనా ఏపీకి వెళ్లిరండని మంత్రి కేటీఆర్ సలహా ఇచ్చారు. ఏపీతో పోలిస్తే..తెలంగాణలో రోడ్లు, మౌలిక సదుపాయాలు బాగున్నాయని చెప్పారు. తెలంగాణలో 111 జీవో ఎత్తివేస్తామని 2014లోనే సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని మంత్రి కేటీఆర్ అన్నారు. జంట జలాశయాలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చూస్తుందని, రాబోయే పదేళ్ల వరకు హైదరాబాద్ అభివృద్ధికి డోకా లేదని అన్నారు. హైదరాబాద్‌లో మత కల్లోలం లేదని, రాష్ట్రానికి ఏం తేవాలో ప్రతిపక్షానికి

(మిగతా 2లో..)

## నా జీవిత చరమాంకం అసోంకు అంకితం: రతన్ టాటా



దిస్పూర్ : భారతీయ దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా ఆసక్తికర ప్రకటన చేశారు. తన జీవిత చరమాంకాన్ని ఈశాన్య రాష్ట్రమైన అసాంకు అంకితం చేస్తానని అన్నారు. అసోంను విశేషమైన, అందరూ గుర్తించగలిగే రాష్ట్రంగా తీర్చదిద్దడంలో తనవంతు సహకారం అందిస్తానని ఆయన చెప్పారు. గురువారం అసోంలో 7 అధునాతన క్యాన్సర్ హాస్పిటల్‌ను ప్రారంభించిన కార్యక్రమంలో పిఎం నరేంద్రమోడీతో రతన్ టాటా కూడా పాల్గొన్నారు. వీరివురూ మరో 7 క్యాన్సర్ హాస్పిటల్స్‌కు శంకుస్థాపన కూడా చేశారు. ఈ సందర్భంగా రతన్ టాటా మాట్లాడుతూ.. తన జీవిత చరమాంకాన్ని అసోంకు అంకితం చేస్తానని అన్నారు. అసోం చరిత్రలో ఇది చాలా ముఖ్యమైన రోజు. క్యాన్సర్ రోగులకు అత్యున్నత స్థాయి వైద్య సదుపాయం ఇకపై అందుబాటులో ఉంటుంది. క్యాన్సర్ అనేది కేవలం సంపన్నులకే వచ్చే వ్యాధి కాదు. (మిగతా 2లో..)

## టెన్త్ పరీక్ష పేపర్ లీక్ కేసులో ఏడుగురు అరెస్ట్



చిత్తూరు: చిత్తూరు జిల్లాలో టెన్త్ పరీక్ష పేపర్ లీక్ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన చిత్తూరు పోలీసులు వెల్లడించారు. మాస్ కాపీయింగ్ కోసం పేపర్ లీకేజీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అరెస్ట్ అయినవారిలో పలు కార్పొరేట్ స్కూళ్ల ప్రిన్సిపాల్స్, ఉద్యోగులు ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు.

## ఏపీకి పెండింగ్ బకాయిలు చెల్లించండి: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: తెలుగు అకాడమీ విజభన కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పెండింగ్‌లో ఉన్న రూ. 33 కోట్లు వడ్డీతో సహా చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలోనే పిటిషన్‌కు వెనక్కి తీసుకునేందుకు తెలంగాణకు కోర్టు అనుమతినిచ్చింది. కాగా, ఏపీకి ఇప్పటికే రూ. 92.94కోట్లు చెల్లించినట్టు తెలంగాణ సర్కార్ తెలిపింది. అయితే, మిగిలిన డబ్బు మొత్తానికి 6శాతం వడ్డీ చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

## శ్రీలంక ప్రధాని మహిందా రాజపక్స తొలగింపునకు అధ్యక్షుడు గొటాబయ అంగీకారం



కొలంబో : శ్రీలంక ప్రధానమంత్రి పదవి నుంచి తన అన్నయ్య మహీంద్రా రాజపక్స తొలగింపునకు ఆ దేశాధ్యక్షుడు గటాబ్య రాజపక్స అంగీకారం తెలిపారు. దేశ చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక సంక్షోభంపై జనాగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో గొటాబయ రాజపక్స ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలో పరిస్థితుల కారణంగా ఏర్పడిన రాజకీయ సంక్షోభం పరిష్కారానికై మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటు ప్రతిపాదనలో గొటాబయ ఈ మేరకు సమ్మతం తెలిపారు. కొత్త ప్రధాన మంత్రి ఎంపిక కోసం నేషనల్ కౌన్సిల్ ఏర్పాటుకు ఆయన సంసిద్ధత తెలిపారని శ్రీలంక ఎంపీ, ఆ దేశ మాజీ అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన వెల్లడించారు. తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో స్వయంగా దేశాధ్యక్షుడు గొటాబయ రాజపక్స, ప్రధాని మహిందా రాజపక్సతోపాటు వీరి కుటుంబానికి చెందిన ఇతర నేతలపైనా దేశవ్యాప్తంగా తీవ్రమైన ఆగ్రహ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. అధికారం నుంచి దిగిపోవాలనే డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు గొటాబయ రాజపక్స ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా విదేశీ అప్పులు భారీగా పేరుకుపోవడం, కరోనా కట్టడిగా వరుసగా లాక్‌డౌన్లు విధించడం, ద్రవ్యోల్బణం, ఇంధన కొరత, విదేశీ మారక నిల్వలు అడుగంటడం, కరెన్సీ విలువ దిగజారడం వంటి ప్రతికూల ప్రభావాలన్నీ ఒకేసారి ఎదురవ్వడంతో శ్రీలంక ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. శ్రీలంక ఈ ఏడాది 7 బిలియన్ డాలర్ల అప్పు చెల్లించాల్సి ఉంది. 2026 నాటికల్లా 25 బిలియన్ డాలర్లు చెల్లించాలి. ఆ దేశ విదేశీ మారక నిల్వలు ప్రస్తుతం 1 బిలియన్ డాలర్ల కంటే తక్కువగా ఉండడం ఆ దేశ దీన స్థితిని తెలియజేస్తున్నాయి.




ప్రజా సమస్యలను మీడియా ద్వారా
ఎత్తిచూపుతూ మీడియా అధిపతిగా
ఎదగాలనుకుంటున్నారా?
అయితే రండి.
రెండు తెలుగు రాష్ట్రాల లోని 294
నియోజకవర్గాల్లో 294 మంది నాయకులు గాని
గ్రూపులుగా గాని ఆయా నియోజకవర్గాల్లో
మీడియా అధిపతులుగా చేస్తున్న ఏకైక ఛానల్
మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్)
రండి... కదలి రండి... చేయి చేయి కలుపుదాం
అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారాన్ని
(Master Key) సాధిద్దాం
వివరాలకు సంప్రదించండి
AP : 88869 11944
TS : 76600 27678, 88860 90484

# ప్రశాంతంగా మచిలీపట్నం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

మచిలీపట్నం :మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ నాన్ – మేజర్ ఓడ రేవు విషయమై ఆంధ్రప్రదేశ్ మారీటైం బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి మచిలీపట్నం మండలం తీర గ్రామాల నుంచి పలువురు వచ్చి పోర్టు ఏర్పాటు విషయంలో పర్యావరణానికి సంబంధించిన తమ అభిప్రాయాలను తెలియజేసారు. రైతులు, ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు వెలుబుచ్చినవారి అభిప్రాయాలను అధికారులు ఆడియో వీడియోలు మినిట్స్ రూపంలో రికార్డింగ్ చేశారు. వాటితో పాటు కొందరు లిఖిత పూర్వకంగా ఇచ్చిన వారి అభిప్రాయాలను కాలుష్య నియంత్రణ మండలి ద్వారా రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మారీటైం బోర్డు సీ ఈ ఓ మురళీధర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, మచిలీపట్నం పోర్టు ప్రాజెక్టు కారణంగా ఒనగూరే ప్రయోజనాలు ఆయన చెబుతూ, మంచి సముద్ర రవాణా సౌకర్యాల కల్పనతో పాటు ఆదాయ వనరుల వృద్ధి చెందుతాయనున్నారు. ఇక ఉపాధి అవకాశాలు విషయానికి వస్తే , మొదటి దశలో 1050 మందికి



(ప్రత్యక్ష) 3000 మందికి (పరోక్ష ) ఉపాధ్ది ఏర్పడుతుందన్నారు. మాస్టర్ ప్లాన్ దశలో 3600 మందికి (ప్రత్యక్ష) పదివేలమందికి (పరోక్ష) ఉపాధి లభ్యమైతే సెమీ స్కిల్డ్ మరియు నైపుణ్యం లేని కార్మికులకు స్థానిక జనాభా యొక్క ఉపాధి సామర్థ్యంపై ప్రత్యేక శ్రద్ధతో నైపుణ్యం మెరుగుపర్చుతామని చెప్పారు. . మచిలీపట్నం పోర్టు కారణంగా ఈ ప్రాంతంలో సామాజిక మౌలిక సదుపాయాల మెరుగుదల ఒనకూరుతుందని అన్నారు. రోడ్లు, రైల్వేలు, హౌసింగ్, నీటి సరఫరా, విద్యుత్ శక్తి, , విద్యాసంస్థలు, ఆసుపత్రులు ఏర్పడనున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 974 కిలోమీటర్ల పొడవైన సహజ తీర ప్రాంతము కలిగివుందని ప్రస్తుతము రాష్ట్రంలో విశాఖపట్నం, గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ డీప్ వాటర్, కాకినాడ ఎంకరేజ్ ,రవ్వ ఓడరేవుల ద్వారా సరకు రవాణా జరుగుతున్నట్లు తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలో 1600 కి.మీ.ల తీరప్రాంతానికి ఏటా 336 మెట్రిక్ టన్నుల సరకు రవాణా జరుగుచుండగా మన రాష్ట్రంలో 974 కి.మీ. లకు గాను ఏటా సుమారు 100 మెట్రిక్ టన్నుల సరకు రవాణా మాత్రమే జరుగుచున్నట్లు వివరించారు. ఈ మొత్తం భారతీయ ఎగుమతుల్లో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ 4 శాతం వాటాను కలిగి ఉందన్నారు. 2030 నాటికి 10 శాతం వాటాను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని చెబుతూ గ్రీన్ ఫీల్డ్ ఓడరేవుల అభివృద్ధికి జాతీయ, రాష్ట్రాలకు మరింత అవసరమైన వినూత్న నమూనాలతో రాష్ట్ర ప్రభుత్వం రామాయపట్నం, మచిలీపట్నం మరియు భావనపాడుల వద్ద మూడు గ్రీన్ ఫీల్డ్ ఓడరేవుల అభివృద్ధిని చేపట్టిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్, మచిలీపట్నం ఓడరేవు 2935 ఎకరాలలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదిత నౌకాశ్రయం ప్రపంచ స్థాయి టెర్మినల్ సౌకర్యాలతో పాటు అనేక రకాల కార్గోలను, ప్రస్తుత మరియు భవిష్యత్ కార్గో డిమాండ్లను నిర్వహించడానికి తగిన విధంగా అన్ని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మచిలీపట్నం పోర్టును ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేయబడుతుందన్నారు వ్యవసాయ ఉత్పతులు, గ్రానైట్, ఎడిబుల్ ఆయిల్, ఇనుప ఖనిజం, బారైట్స్, ఎరువులు, సిమెంట్/సిమెంట్ క్లింకర్, బొగ్గు, కంటైనర్ మరియు ఇతర సాధారణ కార్గోలను ఈ ఓడరేవు ద్వారా నిర్వహించాలని ప్రతిపాదించడమైనదన్నారు. తీరం నుండి దూరంగా కల్పించే సముద్ర సౌకర్యాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. పోర్టు అభివృద్ధికి కావాల్సిన భూ విస్తీర్ణం 1930. 65 ఎకరాలు కాగా, అఫ్ షోర్ సౌకర్యంలో మొదటి దశ ఉత్తర బ్రేక్ వాటర్ 250 మీ పొడవు ఉండగా దక్షిణ బ్రేక్ వాటర్ 2075 మీ పొడవు కల్గి నాలుగు జెట్టీలు ( బెర్తులు ) కల్గి ఉంటుందని అన్నారు. అందులో ఒక బెర్తు బొగ్గు ఎగుమతుల కోసం మిగిలిన మూడు బెర్తులు సాధారణ కార్గో, బహుళార్ధక జెట్టీలు మూడు కల్గి ఉంటుందని తెలిపారు. అనంతరం ఆయన నావిగేషనల్ సౌకర్యాలు గూర్చి వివరించారు. అలాగే పర్యావరణ సతిగతులు, భూ ఉపరితల పర్యావరణ స్థితి, వృక్ష, జంతుజాలం గూర్చి ఆయన వివరిస్తూ, 293 వృక్ష జాతులు ప్రాజోక్ట్ ప్రాంతంలో గుర్తించినట్లు తెలిపారు. అలాగే 440 వృక్షజాతులు బఫర్ ఏరియాలో గుర్తించినట్లు చెబుతూ, 47 జంతు జాతులు ప్రాజెక్ట్ ప్రాంతంలో 175 జంతు జాతులు బఫర్ ఏరియాలో గుర్తించినట్లు తెలిపారు. అలాగే సముద్ర పర్యావరణ స్థితి, సముద్ర నీటి నాణ్యత అందరికి వివరించారు. అంతకన్నా ముందు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి విచ్చేసిన రైతులు, మారిటైం బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్ మోహన్ మాట్లాడుతూ, 30 నెలలలో పోర్టు నిర్మాణం పూర్తి అయ్యే అవకాశం ఉందన్నారు.మచిలీపట్నం పోర్టు ఆంధ్రప్రదేశ్ మారీ టైం బోర్డు ఏ విధంగా నిర్మించనుందో వివరించారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణ ఆవశ్యకత, అందుకు అయ్యే ఖర్చు, ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా లాభాలు, ప్రాజెక్ట్ ఏర్పాటు వల్ల ఏర్పడే పర్యావరణ నష్టం తదితర అంశాల పై రైతులకు అవగాహన కల్పించారు. ఎల్ఈడీ ప్రొజెక్టర్ పై తెలుగులో, ఆంగ్లంలో పూర్తి వివరాలు గణాంకాలతో సహా వివరించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాజీ మంత్రి, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య ( నాని ), ముడా ఛైర్మెన్ బొర్రా నాగభవాని విఠల్, మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ , డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, తంటిపూడి కవితా థామస్ నోబుల్, మాజీ మునిసిపల్ ఛైర్మెన్ షేక్ సలార్ దాదా, మాజీ మచిలీపట్నం జడ్పిటీసీ లంకె వెంకటేశ్వరరావు, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ షేక్ ముస్తఫా ( అచ్చాబా ), మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర , వివిధ పార్టీ నాయకులు, పలువురు, నాయకులు కార్పొరేటర్లు , రైతులు , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నా జీవిత చరమాంకం అసోంకు అంకితం: రతన్ టాటా

(మొదటి పేజీ తరువాయి)

ఇదివరకు అందుబాటులో లేని ఈ హాస్పిటల్స్‌లో ఇకపై చికిత్స తీసుకోవచ్చు అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అసోం అనేది భారత్‌లో చిన్న రాష్ట్రమే అయినా ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్స సౌలభ్యాలు కలిగివున్న రాష్ట్రమని రతన్ టాటా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. అసోంలో ఏడు క్యాన్సర్ హాస్పిటల్స్ ప్రారంభమయ్యాయి. ఒకప్పుడు ఏడేళ్లలో ఒక హాస్పిటల్ ప్రారంభమైనా వేడుక చేసుకోవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు కాలం మారింది. ఒకే రోజు ఏడు క్యాన్సర్ హాస్పిటల్స్ ప్రారంభించాం. మరికొన్ని నెలల వ్యవధిలోనే అసోంలో మరిన్ని క్యాన్సర్ హాస్పిటల్స్ అందుబాటులోకి వస్తాయని ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. నెలల వ్యవధిలోనే ఈ హాస్పిటల్స్ అసోం ప్రజల సేవలో తరిస్తాయని దీమా వ్యక్తం చేశారు. ఇక అస్సాం సిఎం హిమాంత్ బిస్వా శర్మ మాట్లాడుతూ.. రాష్ట్రానికి సహకారం అందిస్తున్న రతన్ టాటా, కేంద్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. అతిపెద్ద క్యాన్సర్ కేర్ హాస్పిటల్ అసోంతోపాటు ఆగ్నేయాసికు కూడా ఎంతో లబ్ది చేకూర్చుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏపీలో పరిస్థితులు అధ్వాన్నం: మంత్రి కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

అవసరం లేదని.. సీఎం కేసీఆర్‌ను తిట్టడంలోనే ప్రతిపక్షం పీజీ చేసిందన్నారు. పనికిమాలిన విమర్శలు చేయడంలో వాళ్లను మించినవారు లేరన్నారు. ముఖ్యమంత్రిని తిట్టడం తప్పు..వాళ్లకు ఏమీ తెలియదని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు.

## బీటెక్ విద్యార్థిని రమ్య హత్యకేసులో సంచలన తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

గొడవపడి కత్తితో ఎనిమిదిసార్లు పొడిచాడు. ప్రభుత్వాస్పత్రికి తరలించేలోగా రమ్య చనిపోయింది. ఈ హత్యను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. నిందితుడు శశికృష్ణను అదేరోజు రాత్రి నరసరావుపేట సమీపంలోని మొలకలూరులో అరెస్టు చేసిన పోలీసులు ఆరురోజుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. గుంటూరు ప్రత్యేక న్యాయస్థానంలో గత ఏడాది డిసెంబర్ ఏడు నుంచి సాక్షుల వాంగ్మూలం నమోదు చేశారు. ఈ నెల రెండున మొదలైన వాదనలు మంగళవారం ముగిశాయి. గుంటూరు ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెల్లడించింది.

**రమ్య కుటుంబాన్ని ఆదుకున్న ప్రభుత్వం**

హత్య జరిగిన రెండోరోజే సీఎం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.పది లక్షల్ని రమ్య తల్లి జ్యోతికి అప్పటి హెూంమంత్రి సుచరిత అందించారు. ఆ కుటుంబానికి మూడు నెలలపాటు నిత్యావసరాలకు నగదు ఇచ్చారు. అదేనెల 20వ తేదీకల్లా రమ్య తల్లికి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద గుంటూరులో ఇంటిస్థలం పట్టా ఇచ్చారు. అనంతరం ప్రభుత్వం మరో రూ.8,25,000 అందజేసింది. ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షలు ఇచ్చింది. రమ్య సోదరి మౌనికకు సెప్టెంబర్ 16న రెవెన్యూ విభాగంలో ఉద్యోగం ఇచ్చింది. ఆమె ఐదేళ్లలోగా డిగ్రీ పూర్తిచేసుకునే అవకాశం కల్పించారు. వారు కోరిన విధంగా వారి సొంత గ్రామమైన అమృతలూరు మండలం యలవర్రులో రూ.1,61,25,300తో ఐదెకరాల పట్టా భూమి కొనుగోలు చేసి రమ్య తల్లి పేరున రిజిస్టర్ చేసింది. రమ్య హత్యకేసు విషయంలో ప్రభుత్వం స్పందించిన తీరు బావుందని జాతీయ ఎస్సీ కమిషన్ వైస్‌చైర్మన్ అరుణ్‌హల్దార్ కొనియాడారు. హత్య అనంతరం గుంటూరు వచ్చిన కమిషన్ బృందం.. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీ ప్రభుత్వం చాలా పాజిటివ్‌గా స్పందించిందని కొనియాడింది.

## జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు పటిష్టవంతమైన ఏర్పాట్లు

### పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాల ఏర్పాటు- కలెక్టర్



మచిలీపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన :మే నెల 6వ తేది నుండి 24వ తేది వరకు నిర్వహించు ఇంటర్ పరీక్షలకు పటిష్టవంతమైనఏర్పాట్లు చేయాలని, అన్ని పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు నియమితులైన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్‌ఆఫీసర్స్, సంబంధిత అధికారులకు ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం స్థానిక ఆశీర్వాద్ భవన్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల నిర్వహణలో నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ ఎలాంటి,సమస్యలు ఏర్పడకుండా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. గత 2 రోజుల క్రితం ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు జిల్లాలో సజావుగా జరుగుతున్నాయని, అయితే కొన్ని జిల్లాల్లో జరిగిన సంఘటనలు కలెక్టర్ గుర్తు చేస్తూ ఇంటర్ పరీక్షలకు ఎలాంటి అవాంతరాలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైన చిన్నసంఘటన జరిగితే అందరు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. పరీక్షల నిర్వహణకునియమించబడిన ప్రతి అధికారి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ముందుగా,మీరు నిర్వర్తించవలసిన విధులపట్ల పూర్తి అవగాహనతో ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తిచేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, త్రాగునీరు, పర్నిచర్ వంటి మౌలికవసతుల గరించి, ప్రతి కేంద్రంలో సిసికెమోరాలు ఏర్పాటు చేశారా లేదా చెక్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిబంధనల ప్రకారం మెబైల్ ఫోన్లు చీఫ్ సూపరింటెండెంట్లు మినహా మిగత ఎవ్వరివద్దఉండకూడదని అన్నారు. నేటి నుండి రోజువారి నిధుల నిర్వహణ చార్టు సిద్ధం చేసుకొని దానినిఅనుసరించాలని అన్నారు.

## కేంద్ర మంత్రి మురుగను ఘన స్వాగతం



మచిలీపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన :కేంద్ర మత్స్యశాఖా మంత్రి ఎల్. మురుగన్ మచిలీపట్నం గిలకలదిండి హార్బర్ను సందర్శించేందుకు వచ్చిన సందర్భంగా ఆయనకు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర మత్స్యశాఖా మంత్రి ఎస్. అప్పలరాజు, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే పేర్ని నాని, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, జాయింట్ కలెక్టర్ మహేష్ కుమార్, జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక, మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ఘన స్వాగతం పలికారు. డ్రెడ్జింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని కేంద్ర మంత్రి మురుగన్తో పాటు రాష్ట్ర మంత్రి అప్పలరాజు, కమిషనర్ కన్నబాబు, కలెక్టర్ రంజిత్ బాషా, ఎంపీ బాలశౌరి ప్రత్యేక బోటులో పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సాయంతో నిర్వహించే డ్రెడ్జింగ్ పనులను కేంద్ర మంత్రి మురుగన్కు బాలశౌరి వివరించారు.

## పార్స్ పల్నాడు జిల్లా నరసరావుపేట ఎన్జీవో అసెంబ్లీ నియోజకవర్గం కార్యదర్శిగా దారా నాగరాజు నియామకం



నరసరావుపేట ఏప్రిల్,29 ప్రజాపాలన ప్రతినిధి: పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) పల్నాడు జిల్లా నరసరావుపేట ఎన్జీవో అసెంబ్లీ నియోజకవర్గం కార్యదర్శిగా దారా నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు పల్నాడు జిల్లా నరసరావుపేట ఎన్జీవో అసెంబ్లీ నియోజకవర్గం కార్యదర్శిగా కోండ్రు మెహన్ దాస్, దారా నాగరాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మీరు మీ పరిధిలో రాజకీయ అవగాహన ముఖ్య నాయకులతో కమిటీలను నియమించడంతో పాటు బహుజన వాదాన్ని బలపరిచే వివిధ రంగాలలో పని చేస్తున్న వారిని పార్స్ అనుబంధ సంఘాలుగా మీ పరిధిలో నియమించి, రెండు విభాగాల మధ్య సమన్వయ పరిచి వారందరి సహకారంతో బహుజన రాజ్యాధికారాన్ని సాధించాలని ఈ సంధర్భంగా ఆయన పేర్కొన్నారు దారా నాగరాజు నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేసారు.

## పార్స్ పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా శిఖినం బుజ్జి నియామకం



నరసరావుపేట ఏప్రిల్,29 ప్రజాపాలన ప్రతినిధి: పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (పార్స్) నరసరావుపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా శిఖినం బుజ్జి నియమితులయ్యారు. ఈ మేరకు నరసరావుపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా కటికల రవి కుమార్, శిఖినం బుజ్జి ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మీరు మీ పరిధిలో రాజకీయ అవగాహన ముఖ్య నాయకులతో కమిటీలను నియమించడంతో పాటు బహుజన వాదాన్ని బలపరిచే వివిధ రంగాలలో పని చేస్తున్న వారిని పార్స్ అనుబంధ సంఘాలుగా మీ పరిధిలో నియమించి, రెండు విభాగాల మధ్య సమన్వయ పరిచి వారందరి సహకారంతో బహుజన రాజ్యాధికారాన్ని సాధించాలని ఈ సంధర్భంగా ఆయన పేర్కొన్నారు శిఖినం బుజ్జి నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేసారు.

## దొడ్డ మల్లేశ్వర స్వామి ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా అలుగునూరి అమరయ్యను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన రజక సంగం నాయకులు



కారంపూడి... ఏప్రిల్29...ప్రజాపాలన... ప్రతినిధి :పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం లో చింతపల్లి దొడ్డ మల్లేశ్వరస్వామి ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ గా అలుగునూరి అమరయ్య ను నియమించడం పట్ల మాచర్ల ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి కి రజక నాయకులు అభినందనలు తెలియజేశారు రజక సంఘం నాయకులు మాట్లాడుతూ 2024లో మండలంలో రజకులు మొత్తం ఏకమై మాచర్ల ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ను అఖండ మెజారిటీతో గెలిపించుకొని మంత్రిగా చూడాలని మా కోరిక అని రజక నాయకులు తెలియజేశారు రజకులకు మొట్టమొదటి సారిగా ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ గా నియమించడంతో మండలంలో ఉన్న రజక సోదరులు ఆనందంగా ఉన్నారని వారు అన్నారు. ఈ సమావేశంలో మాచర్ల ఏడుకొండలు బుల్లిబాబు ఔరంగాబాద్ రామయ్య ఇండ్ల చెరువు శివ మైలవరపు వెంకటకృష్ణ రజక సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శనలు గెలిపొందిన వారికి బహుమతులు అందచేస్తున్న యువనాయకుడు బొల్లా గిరి బాబు



వినుకొండ ఏప్రిల్ 29 (ప్రజాపాలన ప్రతినిధి):వినుకొండ మండలం శ్రీ మదమంచిపాటి వీరాంజనేయస్వామి స్వారి వారి తిరునాళ్ల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శనలు కార్యక్రమంలో పాల్గొని, ఆఖరి రోజు ఎడ్ల పోటీలను ప్రారంభించి, పోటీలో విజేతలు గా నిలిచిన వారికి ప్రధమ స్థానం గెలుపొందిన సీనియర్ సైజు విభాగం లో ఎద్దులు కృష్ణాజిల్లా కాసనేని రాజా చౌదరి గన్నవరం వీరికి 1,00,000/– రూపాయలు స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మానాయుడు కుమారుడు బొల్లా గిరి బాబు చేతుల మీదుగా అందజేశారు ద్వితీయ 75,000/– రూపాయలు , తృతీయ 65,000/–రూపాయలు మెత్తగా 2,40,000/– రూపాయల నగదు బహుమతులను విజేతలకు అందజేసిన వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మానాయుడు తనయుడు యువ నాయకులు బొల్లా గిరిబాబు వారితో పాటు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అన్ని మండలాల జడ్ పి టి సి లు, అన్ని మండలాల యం పి పి లు, వైస్ యం పి పి లు, నియోజకవర్గ లోని మార్కెట్ యార్డు చ్కెర్మన్ లు, నియోజకవర్గ లోని అన్ని సోసైటీ ల ఛైర్ పర్సన్ %ఎ%లు, అన్ని గ్రామాల యంపి టి సి లు, సర్పంచ్ లు మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు పోటీల నిర్వహణ లో పాలుపంచుకున్న మక్కెన. వెంకట్రావు, ఆనుమాలు. సుబ్బారెడ్డి, నక్క, వెంకటేశ్వర్ రెడ్డి (బుల్లిరెడ్డి) జక్కిరెడ్డి. సుబ్బారెడ్డి, కూచిపూడి. చిన్న వెంకటేశ్వర్లు, జక్కిరెడ్డి.అప్పి రెడ్డి, చాగంటి. కోటేశ్వరరావు వీరిని, కమిటీ వారిని ఘనంగా దృశ్యా శాలువాలతో పూలమాలలతో మెమొంటో లతో ఘనంగా సత్కరించారు.

## పదో తరగతి పరీక్షా కేంద్రం ను ఆకస్మికంగా సందర్శించిన ఎస్పీ ఐశ్వర్య రాస్తోగి...



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా, ఎస్పీ ఐశ్వర్య రాస్తోగి, పరీక్షలకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రతి పరీక్షా కేంద్రంలో పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం చేశారు. అలాగే ఎస్పీ స్వయంగా పట్టణంలోని పలు రహదారుల్లో తిరిగి పరిశీలించి, విద్యార్థులు పరీక్షకు హాజరైన సమయంలో వారికి ట్రాఫిక్ ఇబ్బందులకు కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టడం జరిగింది. పదో తరగతి పరీక్షా కేంద్రం (చున్నిలాల్ జాజు రోటరీ మున్సిపల్ హై స్కూల్) ను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించి పోలీసు అధికారులు, సిబ్బంది చేపడుతున్న బందోబస్తు విధులను పర్యవేక్షించి వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



నరసరావుపేట. ఏప్రిల్ 29 (ప్రజా పాలన ప్రతినిధి): నరసరావుపేట పట్టణంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా అందజేసిన శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి .నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి . నరసరావుపేట పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వరవకట్ట ఎల్ఐసి కార్యాలయం పక్కన షేక్ కార్పొరేషన్ ఛైర్మన్ ఖాజావలి మాస్టర్ ఆధ్వర్యంలో పేద ముస్లీం సోదర సోదరీ మణులకు రంజాన్ తోఫా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరై.. రంజాన్ తోఫా పంపిణీ చేశారు. అనంతరం ఎస్ఎస్ఎన్ కళాశాలలో నిర్వహించిన కపిలవాయి కాశీరామారావు 14వ వర్ధంతి సందర్భంగా.. మాజీ మంత్రి వర్యులు కాసు కృష్ణా రెడ్డి , గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి తో కలిసి వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. కపిలవాయి కాశీరామారావు సేవలను స్మరించుకున్నారు. మార్కెట్ సెంటర్ లో షేక్ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివెంద్రంను మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనీఫ్ తో కలిసి ప్రారంభించారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని పనసతోటలో షేక్ ఖాదర్ బాషా ఇంటికి వెళ్ళి వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు.

## శ్రీలంకకు విజ్ఞాన్ డిగ్రీ, నిరులా కళాశాలల నుండి నిత్యవసరాలు అందజేత



గుంటూరు. ఏప్రిల్ 28 (ప్రజాపాలన ప్రతినిధి):ఇటీవల శ్రీలంకలో ఎదురైన ఇబ్బందులు దృష్ట్యా అక్కడి ప్రజలకు తమ వంతు కొంత సాయం చేయాలన్న దృక్పథంతో.. విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజనీరింగ్ కళాశాల, విజ్ఞాన్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, సిబ్బంది ముందుకు వచ్చారు. రెండు కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం వారు నిత్యవసరాలను సేకరించి శ్రీలంకకు పంపుతున్నారు. మొత్తం 30టన్నులు బియ్యం, కందిపప్పు, తదితర నిత్యవసరాలను సేకరించి 'అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ' వారికి గురువారం కళాశాల ప్రాంగణంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, ఎన్ఎస్ఎస్ విభాగాపు అధికారి భవానీ, విద్యా వాలంటీర్లు పాల్గొన్నారు..

## రామాంజనేయులు హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. ఏప్రిల్ 29 (ప్రజాపాలన ప్రతినిధి): నరసరావుపేట పట్టణంలో కళ్యాణ్ జూలరీ లో పనిచేసే రామాంజనేయుల ను కొందరు దుండగులు కిడ్నాప్ చేసి హత్య చేయడం అత్యంత దారుణమని, నిందితులను కఠినంగా శిక్షించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు డిమాండ్ చేశారు.గురువారం విలేకరులతో జి.వి. మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక శక్తులు పెట్రేగి పోతున్నాయని, పట్టపగలు ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసి అత్యంత కిరాతకంగా హత్య చేయటం దారుణమని రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా అని ప్రశ్నించారు.రామాంజనేయులు హత్యకు కారణమైన వ్యక్తులు అధికార పార్టీ అండదండలతో తప్పించుకు తిరుగుతున్నారని, తన కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి భార్య ప్రసన్న ఆందోళన చేపట్టిన అధికారులు హత్యకు కారకులను శిక్షించక పోవడాన్ని చూస్తే హంతకులకు అధికార పార్టీ నీ స్థాయి లో సహకరిస్తుందో అర్థమవుతుందన్నారు.రామాంజనేయులు ను కిడ్నాప్ చేయడంతోపాటు ఉ అత్యంత కిరాతకంగా హత్య చేయడం దుర్మార్గమని నిందితులు ఎంతటివారైనా పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి హత్యకు కారకులైన కఠినంగా శిక్షించి ప్రసన్న కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## క్రీమ్- బోర్న్ ఐస్ క్రీమ్ పార్లర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్



విజయవాడ ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి: నగరం లోని బందర్ రోడ్ పివిపి సమీపంలో కంచికచర్ల -గొట్టుముక్కల గ్రామానికి చెందిన వైఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు%డ% న్యాయవాది మంగళపూడి కోటిబాబు -సురేష్-కిషోర్ లు మేనేజింగ్ పార్టనర్ లుగానూ తనంగా ఏర్పాటు చేసిన క్రీమ్ -బోర్న్ ఐస్ క్రీమ్ పార్లర్ ను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ శు క్రవారం ప్రారంభించి ,నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారుఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# నిరాడంబరతకు నిదర్శనం మన వావిలాలు: అంబటి రాంబాబు



సత్తెనపల్లి: వావిలాల నడయాడిన నేలలో... ఆయన స్ఫూర్తిని, సేవానిరతి కొనసాగించేందుకు... మహనీయుని జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా ప్రతి ఏడాది నిర్వహించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మాత్యులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం వావిలాల గోపాల కృష్ణయ్య19వ వర్ధంతిని పురస్కరించుకొని వావిలాల స్మృతి వనం లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా వావిలాల గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. అనంతరం మున్సిపల్ , గుంటూరు వావిలాల సంస్థ, పట్టణ వావిలాల ప్రజ్వలన సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వావిలాల ప్రజ్వల సమస్త అధ్యక్షులు బండి పూర్ణచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వావిలాల ఘాట్ నిర్లక్ష్యానికి గురై అస్తవ్యస్తంగా ఉ ఒడేదన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పందించి ఘాట్ ను పరిశుభ్ర పరిచి ఆయనకు ఘనంగా నివాళులర్పించామన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ప్రతి ఏడాది ఆయన వర్ధంతి, జయంతి కార్యక్రమాలను బాధ్యతగా తీసుకొని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలోని వాణిజ్య సముదాయానికి కూడా వావిలాల పేరును నామకరణం చేసి ఆయన కీర్తిని, స్ఫూర్తిని చాటిచెప్పామన్నారు. గోపాలకృష్ణయ్య నిరాడంబరంగా, నిబద్ధత గా జీవించినంత గా ప్రస్తుతం ఉన్న రాజకీయాల్లో కొనసాగడం చాలా కష్టమన్నారు. అయినా సాధ్యమైనంత మేరకు నియోజవర్గంలో ఆడంబరాలు లేకుండానే పారదర్శకమైన ప్రశాంతమైన రాజకీయాలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

మహనీయుడు సత్తెనపల్లిలో జన్మించడం మన అందరికీ ముదావహమన్నారు. వావిలాల సాగునీటి ప్రాజెక్టుల కోసం, మద్యనిషేధం కోసం తెలుగు భాషాభిమానుల కోసం గ్రంథాలయాల స్థాపనకు ఆయన చేసిన కృషి, సేవ, ఉద్యమాలు చైతన్యం శ్లాఘనీయమన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై వావిలాల రచించిన పుస్తకాన్ని గుంటూరు వావిలాల సంస్థ కార్యదర్శి,ఆయన మనవడు మన్నవ సోదేకర్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రికి అందించారు. దాన్ని పరిశీలించి స్పందిస్తూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టులకు అవసరమైన అంశాలను పరిశీలించి అధ్యయనం చేస్తామన్నారు. అనంతరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వికలాంగులకు ట్రై సైకిల్ ను అందించారు. మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు,వైకాపా రాష్ట్ర నాయకులు నిమ్మకాయల రాజనారాయణ, మద్యపాన విమోచన కమిటీ చైర్మన్ వల్లెం రెడ్డి లక్ష్మణరెడ్డి, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గీత హసంతి, గుంటూరు వావిలా ల సంస్థ చైర్మన్ లీలా మహేశ్వరి తదితరులు ప్రసంగించారు .ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నాగుర్ మీరాన్, కోటేశ్వరావు నాయక్ ,కమిషనర్ కొలిమి షమ్మీ,కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, రాజుపాలెం మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, నకరికల్లు జడ్పిటిసి జోనెబోయిన హరీష్, దొంతి రెడ్డి శ్రీనివాసరెడ్డి , పలు రాజకీయ, స్వచ్ఛంద సేవా సంస్థల బాధ్యులు, ప్రతినిధులు ఉన్నారు.

## నారా లోకేష్‌పై వైసీపీ ముష్కరుల రాళ్ల దాడిని తీవ్రంగా ఖండించిన టీడీపీ నాయకులు



సత్తెనపల్లి ప్రజాపాలన :దుగ్గిరాల మండలం, తుమ్మపూడి గ్రామంలో అత్యాచారం చేసి హత్యచేసి మహిళని అతి కిరాతకంగా చంపేస్తే, బాధిత కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని పరామర్శకొచ్చిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారు లక్ష్యంగా వైసీపీ వైసీపీ వెధవలు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అనుచరులు, రాళ్లతో దాడి చేయటం సిగ్గుచేటు, అత్యాచారం చేసిన నిందితులను పట్టుకోవాల్సిన పోలీసులు.. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు దుగ్గిరాల మండలం తుమ్మపూడి వచ్చిన లోకేష్‌ని అడ్డుకోవాలని ప్రయత్నించారు. ఇదే అదనుగా వైసీపీ గూండాలు రాళ్లతో దాడి చేశారు వైసీపీ అండతో కన్ను మీన్ను కానరాక మహిళలను హింసించి రేప్ చేసి హత్యలు చేస్తుంటే నిద్రపోతున్న వైసీపీ నాయకులు, చంద్రబాబు గారు, లోకేష్ గారు బాధిత కుటుంబాలను పరామర్శలు చేస్తుంటే ఓర్చుకోలేక దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు మీ తీరు మర్చుకొక పోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తూ నారా లోకేష్ గారిపై జరిగిన రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని యన్,టి,ఆర్, భవన్ లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు సయ్యద్ పెద కరిముల్లా, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, నియోజక వర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిన్న బోయిన వెంకట రాఘవ, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, యర్రా వెంకటేశ్వర రావు, బండారు నాగరాజు, కొల్లు రామ మల్లేశ్వరరావు, పాతూరి కోటి, మాజీ కౌన్సిలర్ పున్నయ్య నాయక్, రాంబో బుడే, సయ్యద్ సైదా, నూర్ బాషా సుబాని, యం, వెంకటేశ్వర్లు, రావిపాటి సాంబయ్య, మాక్కపాటి సుధాకర్, జయబాబు, నల్లురి కుమార్, షేక్ ముస్తఫా, గాలి ఆంజనేయులు, గణేష్ వెంకట్రావు, తోరటి వెంకట్రావు , తదితరులు పాల్గొన్నారు.

## రహదారులకు అధిక ప్రాధాన్యత



నరసాపురం, ఏప్రిల్ 30 (ప్రజాపాలన ప్రతినిధి) : నియోజకవర్గంలోని రహదారులకు అధిక ప్రాధాన్యత నిచ్చి ప్రతీ రహదారిని సుందరంగా తీర్చిదిద్దే విధంగా సుమారు 70 కోట్ల రూపాయలకు సంబంధించి ప్రతిపాదనలు వెంటనే తయారుచేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఆర్ అండ్ బి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చీఫ్ విప్ ప్రసాదరాజు అధికారులతో మాట్లాడుతూ నరసాపురం మండలంలో లక్ష్మణేశ్వరం నుండి పీఎం లంక వరకు ఉన్న రహదారికి, పితానిమెరక నుండి వైయస్ పాలెం వరకు, బియ్యపుతిప్ప, మోళ్ళపర్రు సముద్ర మొగ రహదారుల నిర్మాణం చేపట్టడానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మొగల్తూరు మండలానికి సంబంధించి మెట్టురేవు నుండి కేపిపాలెం వరకు, వెంప నుండి కాళీపట్నం వరకు, ముత్యాలపల్లి నుండి మోళ్ళపర్రు వరకు గల రహదారుల అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలు తయారుచేయాలని ఈ సమీక్షలో అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో పురోగతిలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇప్పటికే మంజూరైన పనులకు సంబంధించి టెండరు ప్రక్రియ పూర్తిచేసి వేగంగా పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్. అండ్.బి యస్.ఈ యస్.లోకేశ్వరరావు, డి.ఈ పివి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ ను కలిసిన ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ పూర్ణచంద్రరావు



పల్నాడు జిల్లా.నరసరావు పేట. ఏప్రిల్ 28.(ప్రజాపాలన ప్రతినిధి) : బిస్వ భూషన్ హరిచందన్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ వారిని రాజ్ భవన్ లో కలిసిన ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ పొనుగు పాటి పూర్ణచంద్రరావు. శుక్రవారం రాజ్ భవన్ లో గవర్నర్ ను కలిసి రజక%డ% ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీ మహిళల పైన జరుగుతున్న హత్యా చార హత్యలు గురించి మెమోరాండం అందజేశారు. డాక్టర్ పొనుగుపాటి పూర్ణచంద్రరావు, ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీ ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు. కొల్లూరు వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రజక ఎస్సీ ఎస్టీ బిసి ముస్లిం మైనార్టీల మహిళలపై అత్యాచారాలు చర్చలు జరుగుతున్నాయని అన్నారు. మహిళలందరికీ న్యాయం చేయాలని అని పూర్ణచంద్రరావు కోరారు ఈ కార్యక్రమంలో లో ఐక్యవేదిక ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు. అంజూరి సత్యనారాయణ, అంజూరి రజక యూత్ లీడర్ తదితరులు పాల్గొన్నారు.

## గంధం ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ ఏప్రిల్ 29 ప్రజా పాలన ప్రతినిధి: పట్టణం నందు శుక్రవారం నాడు మధ్యాహ్నం వల్లీ దేవసేనల సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నాగుల్ మీరా ద ర్గా గంధం ఉత్సవంలో స్థానిక తేదేపా నేతలతో కలసి ప్రత్యేకపూజలలోఅన్నదానకార్యక్రమంలో మాజీ శా సనసభ్యురాలు శ్రీమతి తంగిరాల సౌమ్య పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లో తెదేపా నాయకులు ఏచూరి రాము వడ్డెల్లి సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు


"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేద్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ Rs 5000/-
13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, Rs 5000/-
14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ Rs 2000/-
15. రత్నశ్రీ పార్స్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ Rs 2000/-

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు

మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 30, ఏప్రిల్ 2022

## మోదీజీ, మౌనం వీడండి

ప్రధానమంత్రి గారూ,విద్వేష రాజకీయాలు ఉధృతమవుతున్నాయి. వాటి ఉన్మాదానికి ముస్లింలు, ఇతర మైనారిటీ వర్గాల వారే కాదు, రాజ్యాంగమే బలవుతున్నది. మాజీ సివిల్ సర్వెంట్స్‌గా, మా కళ్ల ఎదుట సంభవిస్తున్న సంఘటనల పట్ల మా మనోభావాలను తీవ్ర పదజాలంతో వ్యక్తం చేయడం అనివార్యమయింది. నిజానికి ఇది మా అలవాటు కాదు. అయితే స్వతంత్ర భారత వ్యవస్థాపకులు నిర్మించిన మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య విలువలు, సంప్రదాయాల విధ్వంసమే మా ఆగ్రహాన్ని, ఆవేదనను ఇలా వ్యక్తం చేసేందుకు బలవంతపెట్టింది.గత కొద్ది సంవత్సరాలుగా, నెలలుగా పలు రాష్ట్రాల– అస్సాం, ఢిల్లీ, గుజరాత్, హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్–లో మైనారిటీ మతస్థులు, ముఖ్యంగా ముస్లింలపై విద్వేష హింసాకాండ పెచ్చరిల్లిపోయింది. ఢిల్లీ మినహా, ఇవన్నీ భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలే కావడం గమనార్హం (ఢిల్లీలో పోలీసు విభాగం కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉంటుంది). ఈ కారణంగా ఆ సంఘటనలు కొత్త పరిమాణాన్ని సంతరించుకున్నాయి. ఇవి, ఇంకెంత మాత్రం హిందూత్వ అస్తిత్వ రాజకీయాల లేదా మతోన్మాదం సదా రగులుతూ ఉండేలా చేసే ప్రయత్నాల పర్యవసానాలు కావు. దశాబ్దాలుగా, గత కొద్ది సంవత్సరాలుగా అవి కొత్త సాధారణ పరిస్థితులలో భాగమైపోయాయి. మన రాజ్యాంగ మౌలిక సూత్రాలను, చట్ట బద్ధ పాలనను మెజారిటేరియన్ శక్తులకు అధీనమై పోవడమే ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. ఈ సంఘటనలలో రాజ్యం పూర్తిగా భాగస్వామిగా ఉన్నట్టు కనిపిస్తోంది. ముస్లింల పట్ల ప్రదర్శిస్తున్న ద్వేషపూరిత శత్రు వైఖరి, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలోని రాజ్య వ్యవస్థలు, సంస్థలు, పాలనా ప్రక్రియలలో అంతర్భాగమైపోయింది. శాంతి సామరస్యాల పరిరక్షణకు ఉపకరణంగా కాకుండా, మైనారిటీ వర్గాలను నిత్యం భయాందోళనల్లో ఉండే విధంగా చట్టాల అమలు జరుగుతోంది. తమ సొంత మత విశ్వాసాలను ఆచరించుకోవడానికి, తమ సొంత ఆచారాలు, వస్త్రధారణ పద్ధతులు, ఆహార సంప్రదాయాలు, మత చట్టాలను అనుసరించేందుకు మైనారిటీ వర్గాలకు రాజ్యాంగ బద్ధంగా లభించిన హక్కులకు ముప్పు కలుగుతోంది. చట్ట విరుద్ధ నిఘా మూకలు నిర్భయంగా పాల్పడుతున్న హింసాత్మక చర్యల వల్లనే కాకుండా చట్టాన్ని దుర్వినియోగపరచడం వల్ల కూడా ఆ ప్రమాదం సంభవిస్తోంది. వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అన్ని విధాల పరిమితులు విధిస్తున్నారు. ఇలా ఒక నిర్దిష్ట మత వర్గానికి వ్యతిరేకంగా ఉద్దేశించిన చట్ట విరుద్ధ నిఘా బృందాల హింసాకాండ అడ్డూ అదుపులేకుండా సాగేందుకు రాజ్యాధికారాన్ని వినియోగిస్తున్నారు. అంతే కాకుండా పాలనా యంత్రాంగానికి ప్రత్యక్షంగా లభ్యమవుతున్న చట్టబద్ధ పద్ధతుల (మతాంతరీకరణ వ్యతిరేక చట్టాలు, పశు మాంసాన్ని ఆహారంగా తీసుకోవడంపై నిషేధాన్ని విధించిన చట్టాలు, అక్రమ ఆక్రమణల తొలగింపు, విద్యా సంస్థలలో యూనిఫామ్ నియమాల నిర్దేశం మొదలైనవి ఇందుకు ఉదాహరణలు) ద్వారా మైనారిటీ వర్గాలలో తీవ్ర భయాందోళనలు నెలకొల్పుతున్నారు. వారి జీవనాధారాలను దెబ్బకొడుతున్నారు. మెజారిటేరియన్ రాజకీయ శక్తులకు, మెజారిటేరియన్ సాంఘిక, సాంస్కృతిక ప్రమాణాలకు తమకు తామే లోబడిపోయే అప్రధాన పౌరులుగా తమ హోదాను అంగీకరించేలా చేస్తున్నారు. తన సొంత పౌరులను– మైనారిటీలు, దళితులు, పేదలు, అణగారిన వర్గాల వారు– విద్వేష హింసాకాండకు గురిచేస్తూ, వారి ప్రాథమిక హక్కులను హరించివేస్తున్న దేశంగా మన దేశం పరిణమించడమనేది ఇప్పుడు ఒక స్పష్టమైన యథార్థంగా ఉన్నది. ఎంతో భయోత్పాతాన్ని కలిగిస్తున్న వాస్తవమిది.అంతకంతకూ ఉధృతమవుతున్న మతోన్మాదాన్ని పరిణామాలు రాజకీయ నాయకత్వం నిర్దేశం ప్రకారమే సంభవిస్తున్నాయా లేదా అన్నది మాకు తెలియదు. అయితే రాష్ట్ర స్థాయిలోనూ, స్థానిక స్థాయిలోనూ పాలనా యంత్రాంగం విద్వేష మూకలు నిర్భయంగా పాల్పడుతున్న భీతావహ చర్యలకు సానుకూల వాతావరణానికి ప్రోది చేస్తుందనడం నిరాధారమైన విషయం కాదు. అటువంటి మద్దతివ్వడం స్థానిక పోలీసులు, ఇతర పాలనాధికారుల నుంచి రావడమే కాదు, దానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలోని అత్యున్నత స్థాయి రాజకీయ నాయకత్వం నుంచి వత్తాసు లభిస్తుందని చెప్పక తప్పదు. స్థానిక స్థాయిలో విద్వేష మూకల ఆగడాలకు పాలనాపరమైన, సంస్థాపరమైన వాతావరణాన్ని ఆ అత్యున్నత స్థాయి రాజకీయ నాయకత్వం సమకూరుస్తోంది. హింసాకాండకు పాల్పడుతున్నది క్రింది స్థాయి వారే అయినప్పటికీ ఒక పథకంలో భాగంగా తమకు నిర్దేశించిన పాత్రను వారు నిర్వర్తిస్తున్నారనేది స్పష్టం. వారి చర్యలను సమర్థించేందుకు పార్టీ ప్రచార యంత్రాంగం అన్ని విధాల తోడ్పడుతోంది.గతంలో సంభవించిన మతోన్మాద అల్లర్లకు, ప్రస్తుత మతోన్మాద హింసాకాండకు మధ్య ఒక తేడా ఉంది. ప్రస్తుత ఘటనలు, హిందూ రాష్ట్ర ఏర్పాటుకు రంగాన్ని సిద్ధం చేసే ప్రయత్నాలలో భాగంగా సంభవిస్తున్నాయి. అంతేకాదు, అటువంటి పరిణామాన్ని అంటే హిందూ రాష్ట్ర ఏర్పాటును నిరోధించే రాజ్యాంగ నియమాలు అమల్లోకి రాకుండా చేసి, మెజారిటేరియన్ నియంతృత్వానికి ఉపకరణమయ్యేలా చేయడమే వాటి లక్ష్యంగా ఉన్నది. మరి రాజకీయ, పాలనాపరమైన అధికారాలకు బుల్‌డోజర్ వాచ్యంగానూ, వాస్తవంగానూ ప్రతీక కావడంలో ఆశ్చర్యమేమీ లేదు. 'యుక్తమైన ప్రక్రియ', 'చట్టబద్ధ పాలన' అనే భావనల ఆధారంగా నిర్మాణమైన రాజ్యాంగ ప్రాసాదం కూల్చివేయబడింది. జహంగీర్‌పురి ఘటనలే ఇందుకు నిదర్శనం. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను కార్యనిర్వాహక వర్గం పాటించక పోవడాన్ని ఇంకెలా అర్థం చేసుకోవాలి?ప్రధానమంత్రి గారూ, 'కానిస్టిట్యూషనల్ కాండక్ట్ గ్రూప్' సభ్యులమైన మేమందరమూ దశాబ్దాల పాటు రాజ్యాంగ సేవలో ఉండి, ప్రస్తుతం విశ్రాంత జీవితంలో ఉన్నాం. ఇప్పుడు మనమెదుర్కొంటున్న ముప్పు ఇంతకు ముందెన్నడూ ఎదుర్కోనిది. రాజ్యాంగ నైతికత, రాజ్యాంగ విహిత ప్రవర్తనకు మాత్రమే కాకుండా మన విశిష్ట, మహోన్నత నాగరికతా వారసత్వమైన సమ్మిళిత సామాజిక వ్యవస్థకు ప్రమాదం వాటిల్లనున్నది. అది ఛిన్నాభిన్నమై పోయే అవకాశముంది. ఇటువంటి విపత్సమయంలో కూడా మీరు మౌనం వహిస్తున్నారు! మీ వాగ్దానం సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ స్ఫూర్తితో మీ మనస్సాక్షికి విజ్ఞప్తి చేస్తున్నాం. భారత స్వాతంత్ర్య అమృతోత్సవాల తరుణంలో విద్వేష రాజకీయాలకు అంతం పలకాలని మీ పార్టీ నియంత్రణలో ఉన్న అన్ని ప్రభుత్వాలకు మీరు పిలుపు ఇవ్వగలరని ఆశిస్తున్నాం. సౌభ్రాతృత్వం, మత సామరస్యం వాతావరణంలో మాత్రమే మన జాతి నిర్మాతల భారత్ భావన సమున్నతమవుతుంది.

# విషమిస్తున్న నిరుద్యోగ సంక్షోభం




పనిహక్కు భావనను ఆమోదించి, అమలుపరచాల్సిన సమయం ఆసన్నమయిందా? అవును అనేదే ఆ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం. తీవ్రమవుతున్న నిరుద్యోగ సంక్షోభం, దాన్ని ఎదుర్కొనేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనలను నిశితంగా గమనిస్తే పనిహక్కు ఆవశ్యకత తేటతెల్లమవుతుంది. పని చేయగల సామర్థ్యమున్న ప్రతి ఒక్కరికీ జీవనాధారాన్ని లేదా పరిహారాత్మక భత్యాన్ని సమకూర్చగల ఒక బృహత్ విధానాన్ని చట్టబద్ధమైన పూచీతో మనం రూపొందించుకుని, అమలుపరచుకోవలసిన అవసరముంది. పనిహక్కు ఆవశ్యకత గురించిన వాదన మూడు ప్రశ్నలకు సమాధానమిచ్చి తీరాలి. అవి: మనకు ఆ హక్కు అవసరమా? నిరుద్యోగ సమస్యకు అది సరైన పరిష్కారమా? సత్ఫలితాలు ఇచ్చే విధంగా దాన్ని అమలుపరచుకోగలమా? మరింత ముఖ్యమైన ప్రశ్న : పనిహక్కు అమలుకు అవసరమైన ధనం మనకు ఉన్నదా? మన దేశంలో ప్రస్తుతం పనిచేయగల వయస్సులో ఉన్న 101 కోట్ల మందిలో 40 శాతం మంది ఉద్యోగాన్వేషణలో ఉన్నారని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ' అధ్యయనంలో వెల్లడయింది. ఈ విషమ పరిస్థితి రానురానూ మరింత తీవ్రమవుతోంది. పనిచేసే వయస్సులో ఉండి ఉద్యోగాన్ని వెదుక్కుంటున్న వారి శాతం గత ఐదేళ్లలో 46 నుంచి 40 శాతానికి పడిపోయింది. అంటే ఆరు కోట్ల మంది ప్రజలు ఉద్యోగాన్వేషణను మానివేశారు. ఎందుకని? ఉద్యోగం లభించే అవకాశం వారికి కనుచూపు మేరలో కనిపించకపోవడమే. మరి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న ప్రతి ఒక్కరికీ అది లభిస్తుందని ఖచ్చితంగా చెప్పలేము మరి. ఒక ప్రామాణిక అంచనా ప్రకారం ప్రస్తుతం మన దేశంలో నిరుద్యోగం రేటు 7.6 శాతం. అంటే 3.3 కోట్ల మందికి ఎటువంటి పనీ లేదు. నిరుద్యోగం నిర్వచనాన్ని కొద్దిగా విస్తృతం చేస్తే నిరుద్యోగుల సంఖ్య ఐదు కోట్లుగా లెక్క తేలుతుంది. ఏమైనా నిరుద్యోగ సమస్యను మీరు ఏ విధంగా చూసినా ఉద్యోగం లేని వారు, అయితే అవకాశం లభిస్తే ఉద్యోగం చేసేందుకు సుముఖంగా ఉన్న వారి సంఖ్య పది కోట్లకు తక్కువగా ఉండదు. 'నిరుద్యోగులు కాబోతున్న వారి'ని, 'సరైన జీతభత్యాలు లేని' ఉద్యోగాలు చేస్తున్న వారిని పరిగణనలోకి తీసుకుంటే నిరుద్యోగ మహాజనుల సంఖ్య ఇంచుమించు 14 కోట్లుగా ఉండగలదని ఖాయంగా చెప్పవచ్చు. ఆధునిక చరిత్రలో మహాఘోరంగా వర్ధిల్లిన నిరుద్యోగంతో మన ప్రస్తుత నిరుద్యోగ సమస్యను పోల్చి చూడండి. 1930లలో అమెరికాలో నెలకొన్న మహా మాంద్యమే నేను ప్రస్తావించిన మహా ఘోర నిరుద్యోగం. ఆనాడు అమెరికాలో 1.5 కోట్ల మంది నిరుద్యోగులయ్యారు. అమెరికాలోని మొత్తం కార్మికులలో వారు 25 శాతం మంది. నేడు మన దేశంలో పరిస్థితి మెల్లగా సమీపిస్తున్న మహా మాంద్యంలా ఉంది. ఇప్పటికే, నాటి అమెరికాలో కంటే అనేక కోట్ల మంది అధికంగా నిరుద్యోగం కోరల్లో విలవిలలాడిపోతున్నారు. మార్గాంతరమేమిటి? అరకొర పరిష్కారాలు పనిచేయవు. రంగాల వారీగా ఎంపిక చేసుకున్న పరిశ్రమల (లేక పారిశ్రామికవేత్తలు!)కు ఉద్దీపనలు ఇస్తే సరిపోదు. 'వ్యాపార సౌలభ్యం' లేదా 'ఆత్మ నిర్భరత' ఇత్యాది అవిశ్వసనీయమైన విధానాలతో ఉద్యోగాల సృష్టి జరగదు. 1930ల నాటి మహా సంక్షోభాన్ని అమెరికా ప్రభుత్వం 'న్యూ డీల్' పథకంతో సమర్థంగా ఎదుర్కొన్నట్టే , మనకు ముంచుకొస్తోన్న మహా సంక్షోభాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున సమగ్ర కార్యాచరణతో ఎదుర్కోవాలి. నిరుద్యోగ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారంలో ఆర్థిక నమూనాపై పునరాలోచన అనేది విధిగా ఒక భాగంగా ఉండితీరాలి. స్థూల ఆర్థిక విధానం, పారిశ్రామిక విధానంపై కొత్త ఆలోచనలు చేయాలి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పటిష్ఠపరచేందుకు ప్రాధాన్యమివ్వాలి. అయితే ఈ ప్రయత్నాలన్నీ దీర్ఘకాలంలో మాత్రమే సరైన ఫలితాల నిస్తాయి. అయితే మనకు కాలం మించిపోతోంది. ఈ విపత్సమయంలో పనిహక్కు కల్పనే మన మహాసంక్షోభానికి సమగ్ర ప్రతిస్పందన అవుతుంది. అదృష్టవశాత్తు పనిహక్కును అమలుపరిచే పద్ధతుల గురించి మనకు కొన్ని మార్గదర్శకాలు ఉన్నాయి. అర్థశాస్త్ర ఆచార్యులు జీన్ డ్రెజె, సంతోష్ మెహ్రోత్ర, అమిత్ బసోలెల ప్రతిపాదనలు మన ముందున్నాయి. సోషలిస్ట్ చింతకుడు రాకేశ్ సిన్హా అధ్యయన పత్రం 'బెరోజ్ గారి: సమస్య ఔర్ సమాధాన్' పనిహక్కు భావనకు ఒక సైద్ధాంతిక ప్రాతిపదికను కల్పించింది. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నాలుగు విధాలుగా జోక్యం చేసుకోవల్సి ఉన్నది. ఈ నాలుగు పరిష్కారాలూ పనిహక్కు అనే సమగ్ర పరిష్కారంలో భాగంగా ఉంటాయి. ఉద్యోగితను పెంచడం ఎక్కడ అవసరమవుతుందో, ఎక్కడైతే సాధ్యమవుతుందో అక్కడ ప్రభుత్వం ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవాలి మరింత స్పష్టంగా చెప్పాలంటే ఉద్యోగితను నేరుగా పెంచేందుకు ప్రభుత్వం నిబద్ధమవ్వాలి. ఖాళీగా ఉన్న 25 లక్షల ప్రభుత్వోద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలి. తద్వారా విద్యావంతులైన యువజనులకు ఊరట కల్పించాలి. దీంతో పాటు ఆరోగ్య భద్రత, విద్య, పోలీస్ దళాలు, పట్టణ మౌలిక సదుపాయాలు, ఇంకా పర్యావరణ విధ్వంసక నిరోధం మొదలైన రంగాలలో అదనపు ఉద్యోగాలను సృష్టించాలి.ప్రభుత్వం చేపట్టవలసిన రెండో చర్య కార్మికులు, ఉద్యోగులను యాజమాన్యాల దోపిడీ నుంచి రక్షించడం. వంద ఉద్యోగాలకు పదివేల మంది పోటీపడుతున్న దురదృష్టకర పరిస్థితుల్లో జీత భత్యాల విషయంలో యాజమాన్యాల దోపిడీని కార్మికులు ఎదుర్కొలేక పోతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మన రాజ్యాంగం నిర్దేశించింది. ఈ రాజ్యాంగ ఆదేశాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు సమర్థించింది. దీన్ని అమలుపరచడం ప్రభుత్వ కర్తవ్యం. ముఖ్యంగా, మున్ముందుగా తన కార్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి రాజ్యాంగ విహిత న్యాయం సమకూర్చాలి.మూడో పరిష్కార చర్య జాతీయ గ్రామీణ ఉపాధి హామీని దాని మౌలిక ప్రణాళిక ప్రకారం పునరుద్ధరించడం. 'ఉపాధి హామీ' పథకం తొలుత డిమాండ్–ఆధారిత పథకంగా ఉండేది. అంటే భౌతిక శ్రమ చేయగల ప్రతి ఒక్కరూ అడిగిన వెంటనే పని కల్పించేదిగా ఉండేది. మౌలిక లక్ష్యం ఏమైనప్పటికీ ఉపాధి హామీ అమలులోకి వచ్చిన కొద్దినాళ్లలో సరఫరా ఆధారిత పథకంగా మారిపోయింది. నిధుల సమస్య ఏర్పడింది. దీనిపై కేంద్రం రాష్ట్రాలు పరస్పర ఆరోపణలు చేసుకొంటున్నాయి. గ్రామీణ భారతంలో సంక్షోభం సమసిపోవాలంటే గ్రామీణ ఉపాధి హామీని డిమాండ్ ఆధారిత పథకంగానే అమలు పరచాలి. కొవిడ్ కారణంగా కోట్లాది వలస కార్మికులు తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్లడంతో గ్రామీణ భారతంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నది విస్మరించలేని వాస్తవం.ప్రభుత్వం చేపట్టవలసిన నాలుగో పరిష్కార చర్య పట్టణ ఉపాధి హామీ పథకం. గ్రామీణ ఉపాధి హామీ పథకం వలే ఇది కూడా కనీస వేతనంపై కనీసం 100 రోజుల పాటు పనికల్పనకు హామీ కల్పిస్తుంది. పట్టణ స్వపరిపాలన సంస్థలు దీన్ని అమలుపరచవలసి ఉంది. అయితే గ్రామీణ ఉపాధి హామీ కంటే దీన్ని భిన్నంగా అమలుపరచవలసి ఉంది. అనిపుణ కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు నిపుణ కార్మికులకు ముఖ్యంగా మహిళలకు పార్ట్ టైం ఉద్యోగాలను కోరుకునే మహిళలకు ఉపాధి కల్పించవలసి ఉన్నది. ఈ పథకం అమలులో ప్రైవేట్ సంస్థలను కూడా ఏదో ఒక విధంగా భాగస్వాములను చేసేందుకు అవకాశమున్నది. గ్రామీణ ఉపాధి హామీ వలే, ఇది కూడా పనికి దరఖాస్తు చేసుకుని, పనిని పొందలేనివారికి నిరుద్యోగ భృతి సమకూర్చాలి. ఈ సరికొత్త పట్టణ ఉపాధి హామీ పథకం అమలుకు అవసరమైన మౌలిక కృషి ఇప్పటికే జరిగింది. ఆర్థికవేత్తలు జీన్ డ్రెజ్, అమిత్ బసోలెల ప్రతిపాదనల ఆధారంగా ఆ కృషి జరిగింది. కేరళ, హిమాచల్, రాజస్థాన్, జార?ండ్, మహారాష్ట్ర మొదలైన రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఇప్పటికే ఇటువంటి పథకాలను అమలు పరుస్తున్నాయి.అసలు ప్రశ్న ఏమిటంటే పనిహక్కును 'మనం' అమలుపరచగలమా? మొదటి మూడు పరిష్కార చర్యలు ఇప్పటికే అమలులో ఉన్న ప్రభుత్వ పథకాల ఆధారంగా అమలుపరిచేందుకు ఆస్కారమున్నది. కొంత అదనపు వ్యయం అవసరమవుతుంది. నాల్గవది అంటే పట్టణ ఉపాధి హామీ పథకం అమలుకు చాలా పెద్ద మొత్తంలో అదనపు నిధులు అవసరమవుతాయి. ఈ పథకం కింద రూ.2.8 లక్షల కోట్లతో 3.3 కోట్ల మందికి ఉపాధి కల్పించవచ్చని అమిత్ బసోలే నేతృత్వంలోని అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం పరిశోధకులు అంచనా వేశారు. ఈ వ్యయం మన జీడీపీలో 1.7 శాతం. మొదటి మూడు పరిష్కార చర్యలకు అవసరమయ్యే అదనపు వ్యయాన్ని కూడా కలుపుకుంటే పనిహక్కు అమలుకు అయ్యే మొత్తం వ్యయం మన జీడీపీలో 3 శాతంగా ఉండగలదు. నిజానికి ఇదేమంత పెద్ద వ్యయం కాదు. ఇటీవలి సంవత్సరాలలో 'మనం' చేసిన కొన్ని ఇతర వ్యయాలతో పోల్చి చూడండి. ఒక్క 2021 సంవత్సరంలోనే బ్యాంకులు రూ. 2లక్షల కోట్ల పారు బాకీలను రద్దు చేశాయి. పరిశ్రమలకు నేరుగా సబ్సిడీల రూపేణా రూ.1.9 లక్షల కోట్ల ఆర్థిక సహాయమందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కార్పొరేట్ పన్ను రేటును 30 నుంచి 22 శాతానికి తగ్గించడం వల్ల ప్రభుత్వం రూ.1.5 లక్షల కోట్ల రాబడిని కోల్పోయింది. మరి పనిహక్కు అమలుకు అవసరమైన అదనపు ఆదాయం ఎక్కడ నుంచి సమకూరుతుందని మీరు చింతిస్తున్నారా? అలాంటి చింత అవసరం లేదు. కొవిడ్ మహమ్మారి కాలంలో మన కోటీశ్వరులు రూ.20లక్షల కోట్ల లాభాలను ఆర్జించారు. నిరుద్యోగ సంక్షోభం పరిష్కారానికి ప్రభుత్వం అగ్ర ప్రాధాన్యమిస్తే అవసరమైన ఆదాయం అందుబాటులో ఉంది. అంతేకాదు మరింత ఆదాయాన్ని సృష్టించేందుకు అనేక అవకాశాలున్నాయి. మరి నిరుద్యోగం సంక్షోభం పరిష్కారానికి ప్రభుత్వం అగ్ర ప్రాధాన్యమిస్తుందా? ఇస్తుందని నేను భావించడం లేదు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అసలు సమస్య తీవ్రతనే గుర్తించడం లేదు. ఇక పరిష్కారానికి ఎలా పూనుకుంటుంది? పటిష్ఠ రాజకీయ సమీకరణల ద్వారా మాత్రమే మోదీ సర్కార్ వైఖరిని మార్చవలసి ఉంటుంది. ఇప్పుడు అటువంటి ప్రజా సమీకరణలు ఎంతైనా అవసరం. ప్రభుత్వం తన ఆర్థిక విధానాలపై పునరాలోచన చేసేలా ఉద్యమాల రూపేణా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలి. పనిహక్కు అమలుకు ఒక ప్రజా ఉద్యమం అవసరం.

## ఎండా కాలం

ఎండలు బాగా మండే కాలం
నూతులు చెరువులు ఎండే కాలం
చెమటలు బాగా పట్టే కాలం
వడ దెబ్బతో వణికే కాలం
దాహం బాగా వేసే కాలం
దేహం నీటిని కోరే కాలం

పిల్లల్లారా.. పాపల్లారా
చాలా చాలా జాగ్రత్త
ఎండకు ఎక్కువ తిరగొద్దు
టోపీ గొడుగు వాడండి
నీడన ఎక్కువ మెలగండి
నీటిని బాగా తాగండి

పళ్ళరసాలు తాగిన మేలు
ఉప్పు కలిపిన మజ్జిగ చాలు
పశువులు పక్షుల కోసం
నీటిని ఒక చోట పెట్టండి
ఉక్కపోతలో చిక్కొద్దు
ఊరికే ఎండలో తిరగొద్దు

ఇది ఎండా కాలం
ఎండలు బాగా మండే కాలం
పిల్లల్లారా.. పాపాల్లారా
చాలా చాలా జాగ్రత్త!

– గరిమెళ్ళ.వి.ఎన్.నాగేశ్వరరావు

## నువ్వు

పూలిచ్చే మకరందాలూ
ప్రాత:కాలపు మంచు బిందువులూ
తరులిచ్చే ఫలరసాలూ
తరలి వచ్చే తేనె ప్రవాహాలూ ఒకటేమిటి
క్షీరామృత ధారలెన్నో
మది క్షేత్రాన్ని మాధుర్యమై తాకుతున్నాయి
అయినా ఎంతకీ నిండని మధు పాత్రలా
గొంతెండిన పాటలా మిగిలాను
నువ్వొచ్చావుజి
చిరకాలపు దాహార్తిని చిటికెలోన తీర్చావు
నక్షత్రాలను దోసిట తెచ్చి నా గాత్రంలో
పేర్చావు
నీ స్పర్శతో సంగీత నదిగా మార్చావు
వెలుగులీను పాటనై నీ వెంట నడిచాను
ఇంతకీ నువ్వెవరు?



– డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ,

## మూడేళ్లలో 8వందల అత్యాచారాలు



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 29: గుడివాడ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో రికార్డు స్థాయిలో రాష్ట్రంలో 8వందల అత్యాచారాలు జరగడం ప్రభుత్వానికి సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వ అసమర్ధ పాలనలో అభివృద్ధి అటకెక్కి, దేశంలో ఎక్కడా లేని విధంగా దోపిడీలు, దుర్మార్గ కార్యక్రమాలు రాష్ట్రంలో జరగడం బాధాకరమని రావి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షులు వాసే మురళి, పార్టీ నాయకులు కొడాలి రామరాజు, చింతల ప్రసాద్, రామిదెని వేణు బాబు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన సేవలు అందించాలి: ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం, ఏప్రిల్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) :ఆలయాల అభివృద్ధికి నూతన పాలకవర్గాలు బాధ్యత తీసుకుని భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని చినఅమిరం గ్రామంలోని శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయానికి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పాలకవర్గ చైర్మన్ గా పిన్నమరాజు భారతిలక్ష్మి, ధర్మకర్తలుగా చాపాని గౌరమ్మ, బుంగా నాగమణి, లంకా ఉమాపార్వతి, గుడిమెట్ల వెంకట కోటి వీరనాగమ్మ, దూడల చిట్టయ్య, ఆలయ ఈవోగా ఉషా సంధ్యలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పాలకవర్గసభ్యులు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాసును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ పాలకవర్గాలు దేవుడికి సేవ చేయడంతోపాటు ఆలయానికి వచ్చే భక్తులకు కనీస వసతులు కల్పించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొట్టుముక్కల పద్మరాజు, శివరాజు ,చాపాని శివగణేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్ధనలు



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 29: గుడివాడ పట్టణం బంటుమిల్లి రోడ్డు లోని మియాఖాన్ పెద్ద మసీదులో పవిత్ర రంజాన్ మాస చివరి శుక్రవార ప్రార్ధనలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు సయ్యద్ చాన్ రజా రంజాన్ మాస విశిష్టతను తెలియజేశారు. నెలపొడుపు కనిపించిన తర్వాత రోజు ఈద్ రంజాన్ వేడుకలు జరుగుతాయని చాన్ రజా చెప్పారు. పవిత్ర రంజాన్ మాస ఉపవాసాలు, ప్రార్ధనలు విజయవంతంగా జరిగేందుకు సహకరించిన పురపాలక సంఘ అధికారులు, ప్రజానీకానికి మైనార్టీ పెద్దలు షేక్ బాజీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్వ మానవాళి శ్రేయస్సు కోసం మసీదు ప్రాంగణం లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మియాఖాన్ కమిటీ అధ్యక్షుడు షేక్ వలి, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## తమిళనాడు అమ్మాయి ని సురక్షితంగా కుటుంభ సభ్యులకు అప్పగించిన గన్నవరం పోలీసులు



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్29: ది.:20-04-2022 వ తేదీన రాత్రి 21.00 నుండి 22:00 గంటల సమయం లో తమిళనాడు వెల్లూరు నుంచి ఇంట్లో అలిగి వచ్చిన ఒక మహిళను గుంటూరు నుండి గన్నవరం ఎయిర్ పోర్ట్ కి తీసుకు వచ్చిన గుంటూరు జిల్లా తుళ్ళూరుకు చెందిన ఆటో డ్రైవర్ దున్న నారాయణ ఆమె ప్రవర్తన మాటతీరు అనుమాస్పదంగా ఉండటంతో ఆమెను గన్నవరం పోలీస్ స్టేషన్ కి తీసుకుని వచ్చి అప్పగించాడు ఆమెను విచారించి కుటుంబ కలహాల కారణంగా ఆమె మానసికంగా కలత చెంది ఇంటినుండి వచ్చేసినట్లుగా గుర్తించి అంతట కృష్ణా జిల్లా ఎస్ పి సిద్ధార్థ్ కౌశల్ ఐపీఎస్ వారి ఉత్తర్వుల మేరకు, గన్నవరం డి ఎస్ పి, విజయ్ పాల్ నేతృత్వంలో ఆమె ను గన్నవరం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కొమాకుల శివాజీ విజయవాడ వాసవ్య మహిళా మండలిలో సంరంక్షణ నిమిత్తం ఉంచిన్నారు. అనంతరం వారి పెద్దలకు విషయం తెలియపరచి పిలిపించగా ఆమె వారితో వెళ్ళుటకు నిరాకరించింది అంతట ఆమెకు ఆమె కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చెసి ఆమెను ఒప్పించి కుటుంబ సభ్యులతో వెల్లూరు పంపడం జరిగింది బాధ్యతగా వ్యవహరించి ఒక మహిళ సంరక్షణకు తోడ్పడిన సదరు ఆటో డ్రైవర్ దున్న నారాయణ ను గన్నవరం పోలీస్ స్టేషన్ లో సన్మానించి నగదు పోత్సాహం ఇచ్చి గన్నవరం పోలీసులు సత్కరించడం జరిగింది.

## మహిళలపై అత్యాచారాలను పట్టించుకోని ప్రభుత్వం



నరసాపురం, ఏప్రిల్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) : రాష్ట్రంలో నిత్యం మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవని నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు విమర్శించారు. శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, హత్యలు, మహిళల అక్రమ రవాణా తదితర విషయాల్లో దేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఐదో స్థానంలో నిలిచిందని అన్నారు. బాధితులను పరామర్శించి ఓదార్చడం కూడా ఈప్రభుత్వంలో నేరంగా మారిందని ఆయన దుయ్యబట్టారు. గుంటూరు జిల్లాలో హత్యకు గురైన మహిళ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గుండాలు రాళ్ల దాడికి పాల్పడటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. తెలుగుదేశం పార్టీకి రోజురోజుకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ బాధితుల పక్షాన నిలబడుతుందని అన్నారు. అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి జగన్ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం నిత్యావసర ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్, విద్యుత్ ధరలను పెంచుకుంటూ పోతున్నారని అన్నారు. ప్రజలకు ఎడాపెడా బాదుడే మిగిలిందని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి జగన్ నిరంకుశ పాలనను తప్పుబట్టారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు వేచి చూస్తున్నారన్నారని ఆమె అన్నారు. ఈ సమావేశంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు జక్క%శీ% శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి కొల్లు పెద్దిరాజు, పార్టీ నేతలు తిరుమాని శశిదేవి, కొలచన శ్రీపద్మ, పెమ్మాడి శ్రీదేవి, అధికారి అనంత రామారావు, మల్లాడి మూర్తి, సంకు భాస్కరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## "దిశ చట్టం స్ఫూర్తి"రమ్య హత్య కేసులో దోషికి తొమ్మిది నెలల్లో ఉరిశిక్ష

### మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ స్పందన



అమరావతి: ఏప్రిల్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) :గుంటూరులో ఉన్మాది కత్తిపోట్లకు బలైన రమ్య హత్యకేసు నిందితునికి ఉరిశిక్ష ఖరారు చేస్తూ ప్రత్యేక కోర్టు తీర్పునివ్వడం సర్వత్రా హర్షణీయమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. ఇది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'దిశ' చట్టం స్ఫూర్తిగా ఆమె స్పష్టం చేశారు. కోర్టు తుదితీర్పు వెలువడగానే శుక్రవారం ఆమె మీడియా ముందు స్పందించారు. ఘటన జరిగిన ఆరు రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయడం.. హత్యకేసు నిందితుడికి తొమ్మిది నెలల్లో ఉరిశిక్ష ఖరారనేది రికార్డ్ బ్రేక్ అన్నారు. మహిళల కేసుల్లో అత్యంత వేగంగా విచారణలు, శిక్షలు ఖరారవడమనేది సత్వర న్యాయానికి మార్గమన్నారు. మహిళా సంక్షేమాన్ని, భద్రతను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'దిశ' చట్టాన్ని తేవడంతో పాటు రమ్య హత్య ఘటనపై ఆయన తీవ్రంగా చలించి బాధిత కుటుంబాన్ని అన్నిరకాలుగా ఆదుకున్నారని వివరించారు. కేసు విచారణ, చార్జిషీట్ పూర్తి చేయడంలో ముఖ్యమంత్రి సూచనలతో పోలీసులు పకడ్బందీగా సాక్ష్యాలను సేకరించారని వాసిరెడ్డి అన్నారు. ప్రత్యేక కోర్టు శరవేగంతో విచారణ, శిక్ష ఖరారు వెనుక పోలీసుల శ్రమ,మహిళల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి కనిపిస్తుందన్నారు. ఈ కేసు విచారణ పట్ల పోలీసు యంత్రాంగం కృషిని.. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని స్వయాన జాతీయ ఎస్సీ కమిషన్ సైతం మెచ్చుకుందని ఆమె గుర్తు చేశారు. దోషికి కోర్టు విధించిన ఉరిశిక్ష శరవేగంగా అమలు చేసే వరకు మహిళాలోకం, సమాజం బాధ్యత తీసుకోవాలని వాసిరెడ్డి పద్మ పిలుపునిచ్చారు.

## గుంటూరులో ఘనంగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు జన్మధిన వేడుకలు



గుంటూరు.ఏప్రిల్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) : నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు జన్మదినం సందర్భంగా శుక్రవారం పార్టీ నేతలు, అభిమానులు ఘనంగా వేడుకలను నిర్వహించారు. పలు చోట్ల నేతలు, అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గుంటూరులోని, జేకేసీ కాలేజీ రోడ్డులోని పార్టీ కార్యాలయం నందు నాయకులు, అభిమానులు భారీగా కేక్ కట్ చేసి.. ఎంపీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పోలూరి వెంకటరెడ్డి, ఇంటూరి బాబ్జీనంద, బుజ్జి, అత్తోట నరసింహారావు, చింతిరెడ్డి వెంకరెడ్డి, నూతల పాటి హనుమయ్య, కాల్వపల్లి సాంబిరెడ్డి, దేవెళ్ల వెంకట్, జాన్‌బాబు, కిషోర్, లలిత్, శేషిరెడ్డి, యువత పాల్గొన్నారు.వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ళ వెంకట్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గుంటూరు, చుట్టిగుంట దగ్గరలోని..కళ భారతి అంధుల పాఠశాలలో.. బాధితులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లోకోస్టల్ కేర్ హాస్పిటల్ ఎండీ జాన్ బాబు , వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి తన్నీరు సాంబయ్య , యువనాయకులుతురక మల్లేశ్వరావు సోమిశెట్టి వినోద్, బత్తుల దుర్గ పులి శ్రీనివాస్ ,ఉప్పు గోపి తదితరులు పాల్గొన్నారు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పుట్టినరోజును పురస్కరించుకుని.. ఎంపీ అభిమానులు ఇజిగాని ప్రవీణ్ కుమార్, అన్వర్ (లైన్‌మెన్) అందించిన ఫలాలను, స్వీట్స్‌ను.. ఎంపీ సిబ్బంది చేతుల మీదుగా.. గుంటూరు, అరండల్‌పేటలోని నిర్మల్ హృదయ్ ఆశ్రమం నందు ఉన్న బాధితులకు అందజేయటం జరిగింది. మంగళగిరి మండలం, చినకాకాని వద్ద ఉన్న షైన్ ఆనంద శరణాలయం నందు.. హెచ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో.. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్



భీమవరం, ఏప్రిల్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) :మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాళ్ల మండలం బొండాడ గ్రామంలో జరుగుతున్న పిల్ట్ ఛానల్ పనులను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ పనిచేస్తున్న వారి హాజరును పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ ఉదయం ఎన్ని గంటలనుండి పని చేస్తున్నారు, మధ్యాహ్నం ఎన్ని గంటలు పని చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్నిరోజులు పనిచేశారు, రోజుకు ఎంత వస్తుంది, సరైన సమయానికి డబ్బులు అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. ఈ ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ వెంట డ్వామా పిడి డి .రాంబాబు, ఏపిడి కనకదుర్గ, టి ఏ విజయబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవులకు దాహం తీరుస్తున్న గుడివాడ పట్టణ జనసైనికులు



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 29: కృష్ణాజిల్లా గుడివాడ పట్టణ జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో అనేక చోట్ల మూగజీవులకు నీటి కుండీలు ఏర్పాటు చేసిన గుడివాడ పట్టణ జనసైనికులుఈ సందర్భంగా పట్టణ జనసేన నాయకులు మాచర్ల రామకృష్ణ మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారి ఆశయాలతో ఆంధ్రుల అన్నపూర్ణ శ్రీమతి డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పట్టణంలో ప్రజలకు చలివేంద్రాలు తో పాటు మూగజీవులకు నీటి కుండీలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.. దయచేసి ప్రజలు మీ ఇంటి పరిసర ప్రాంతాలలో మూగజీవాలకు పక్షులకు నీరుని అందించాలని కోరారు, జీవితమంటే జననం మరణం కాదని సమాజానికి పదిమందికి ఉపయోగపడినప్పుడే ఆ జీవితానికి పరమార్ధం అని తెలియజేశారు.. మా పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజా సమస్యలను గుర్తించి సమస్యల మీద పోరాటం చేస్తున్నామని సేవే మార్గం ప్రేమే లక్ష్యం అని ప్రజలతో మమేకమై ఉంటున్నామని గుడివాడ పట్టణ ప్రజలు నిండు మనసుతో మా అందరినీ ఆశీర్వదించాలని కోరారు, ఈ కార్యక్రమంలో జనసేన ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ కరీం, చరణ్, అయ్యప్ప, జగదీష్, మెకానిక్ మూర్తి గారు, చింత దుర్గా రామకృష్ణ, మరియు జనసైనికులు పాల్గొన్నారు.

## నూతన కోఆప్షన్ పదవుల్లో పూర్తిగా సామాజిక న్యాయం: ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట ఏప్రిల్ 29 ప్రజాపాలన ప్రతినిధి:శుక్రవా రం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్ర త్యేక కౌన్సిల్ సమావేశంలో కో-ఆప్షన్ ఎన్నికల ప్ర క్రియలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసన సభ్యులు సామినేని ఉదయభానుపాల్గొని మాట్లాడు తూ నూతనంగా కో-ఆప్షన్ పదవులలో పూర్తిగా సా మాజిక న్యాయం పరంగా ఇవ్వడం జరిగింద ని,మై నారిటీ కోటలో షేక్ ఖాదర్ బాబుకి,మహిళా మైనారి టీ లో షేక్ బషిరున్నిషాకి,జనరల్ కోటలో చౌడవరపు జగదీష్ కి అవకాశం కల్పించడం జరిగిందని,పార్టీ ఇ చ్చిన ఈ అవకాశాన్ని పార్టీ సద్వినియోగం చేసుకోవా లని, పార్టీ కి భవిష్యత్ లో అన్ని విధాలుగా అండగా ఉండాలని, కౌన్సిల్ సభ్యులు పట్టణ అభివృద్ధి పైన దృష్టి సారించాలని, వార్డులో ప్రతి క్షణం ప్రజలకు అం దుబాటులో ఉంటూ వార్డు సమస్యలను కౌన్సిల్ దృ ష్టికి తీసుకుని వచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకో వాలని, ప్రతిపక్ష సభ్యుల సూచనలను కూడా పరిగణ లోనికి తీసుకుని ముందుకు వెళ్ళాలని, అభివృద్ధి లో వివక్షకు తావులేకుండా పనిచేస్తామని,అలాగే పట్ట ణంలో పర్యాటక స్థలంగా మిని బైపాస్ లోని చెరువు ను అభివృద్ధి చేస్తామని తెలుపుతూ మరోసారి నూ తనంగా కౌన్సిల్ లోకి అడుగు పెట్టిన కో-ఆప్షన్ స భ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారుఈ నూతన కో ఆప్షన్ సభ్యుల సన్మాన కార్యక్రమంలో కెడిసిసి బ్యాం క్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మరియు అధికార,ప్రతిపక్ష కౌన్సిలర్స్,అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు



కంచికచర్ల ఏప్రిల్ 29(ప్రజాపాలన ప్రతినిధి) రోడ్డు ప్ర మాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘ టన కీసర గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది వి వరాల్లోకి వెళితే మండల పరిధిలోని కీసర కెమికల్ ఫ్యాక్టరీ సమీపంలో స్వర్ణ టోల్ ప్లాజా కి సంబంధించి న వాటర్ ట్యాంక్ 65వ జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో ఉన్న పూల మొక్కలకు నీళ్ళు పడుతూ ఉం డగా విజయవాడలో వైపు నుంచి హైదరాబాద్ వెళు న్న డీసీఎం వ్యాన్ వేగంగా ట్యాంకర్ నీ వెనుక నుంచి ఢీ కొనడంతో కీసర గ్రామానికి చెందిన గోపి (40) గా యాలు కాగా డి సి యం ముందుభాగం పూర్తిగా దె బ్బతినడంతో డ్రైవర్ జమిల్ (30) సీట్లు లో ఇరు క్కు పోయాడు స్థానికులు సుమారు గంట సేపు కష్టపడి అతన్ని ప్రాణాలతో బయటకు తీసి హైవే అంబులెన్స్ లో నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు స మాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘట న స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

## కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలపై పోరాడుదాం!

### 136వ మే డే ను ఘనంగా నిర్వహిద్దాం!




రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి:మే డే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు ఏ వి రమణ ఐ.ఎఫ్.టి.యు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ముద్రించిన మేడే పోస్టర్లను రాజమహేంద్రవరం ఆర్యాపురం ఆడతి సెంటర్ లో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఏ.వి రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏ వి రమణ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం పై మేడే పోరాట స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్టియు జాతీయ కమిటీ లేబర్ కోడ్ ల రద్దు కోసం, ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఉద్యోగ భద్రత కోసం, అసంఘటిత రంగ కార్మికుల హక్కులకోసం పోరాడాలని 136వ మే డే ను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆ పిలుపు ని విజయవంతం చేయాలని ఏ వి రమణ కోరారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కోరాడ అప్పారావు కోశాధికారి డి శ్రీనివాసరావు ఐఎఫ్టియు నాయకులు ఆదినారాయణ కాకుల వెంకటేశ్వర్లు పెట్ట నరసింహమూర్తి దేవర రమణ గడ్డం రాజు కొక్కుల రామారావు దేవేంద్ర కుమార్ ఏ గోగులయ్య కాలిపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తాం

### పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి మారుతి ప్రసాద్..




నరసరావుపేట- ఏప్రిల్ 29 - (ప్రజాపాలన ప్రతినిధి) : నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో ప్రజా సమస్యలతో పాటు రైతు కూలీలు, కార్మికుల సమస్యలపై పోరాటాలు చేస్తామని పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి ఏ మారుతి ప్రసాద్ అన్నారు. నరసరావుపేట పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశించిన కార్యక్రమాలను జిల్లాలో తూచా తప్పక పాటిస్తామని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులతో కలసి ఏడు నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రణాళికలు రూపొందించుకొని పోరాటాలు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, మహిళా సమైక్య అధ్యక్షురాలు సుబ్బాయమ్మ తో పాటు ఏడు నియోజకవర్గాల జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మొన్న టీసీఎస్ 60, నిన్న క్యాప్ 50, నేడు ఇన్ఫోసిస్‌కు 51మంది సెయింట్ ఆన్స్ విద్యార్థుల ఎంపిక

చీరాల, ఏప్రియల్ 29, ప్రజాపాలన : చీరాల సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు, దేశంలోని ప్రముఖ కంపెనీలు, ఉద్యోగాలు ఇచ్చేందుకు పోటీ పడుతున్నాయి. డాక్టరేట్లు చేసిన ప్రొఫెసర్లు, నాణ్యమైన విద్య, మెరుగైన వసతులతో సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అయితే చాలు అన్న ఆత్మవిశ్వాసంతో, పలు కంపెనీలు వరుసగా ఇంటర్వ్యూలు నిర్వహించటం నిదర్శనంగా మారింది. మొన్న ప్రముఖ టీసీఎస్ కంపెనీ 60 మందిని ఎంపిక చేయగా, నిన్న క్యాప్ జెమిని కి మరో 50 మంది విద్యార్థులను, నేడు ఇన్ఫోసిస్ తమ కంపెనీకి 51మంది సెయింట్ ఆన్స్ విద్యార్థుల ను ఎంపిక చేసుకోవడాన్ని బట్టి, సెయింట్ ఆన్స్ కళాశాల కీర్తి



జాతీయస్థాయిలో గుర్తించబ డిందని స్పష్టమవుతోంది. అంతే కాక, ఒక్క ఏప్రియల్ నెలలోనే, ఐదు ప్రముఖ కంపెనీ లు ఇంటర్వ్యూ లు నిర్వహించడం గమనార్హం. టెక్ మహీంద్రా కంపెనీ 26మందిని, ఇన్నోవైండ్స్ ఆరుగురుని, టి.సి.ఎస్. కంపెనీకు 60మంది, క్యాప్ జెమినికి 50మంది విద్యార్థులు ఎంపిక కాగా, ప్రముఖ మల్టీనేషనల్ సాఫ్ట్ వేర్ కంపెనీ ఇన్ఫోసిస్ కి, చీరాల సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, 51 మంది ఎంపికైనట్లు, కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు లు సంయుక్తముగా తెలియజేశారు. చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, 2001లో స్థాపించబడి, ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లి వారి గుర్తింపు మరియు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాకినాడ వారి శాశ్వత గుర్తింపు, నేషనల్ బోర్డ్ అఫ్ ఎక్రిడిటేషన్ వారిచే 3సార్లు గుర్తింపు, నాక్ వారిచే 2 సార్లు 'ఎ' గ్రేడ్ గుర్తింపు, యూనివర్సిటి గ్రాంట్స్ కమీషన్ వారిచే 2(యఫ్)మరియు12(బి) ద్వారా గుర్తింపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ద్వారా 'ఎ' గ్రేడ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ద్వారా శాశ్వత గుర్తింపు, టైమ్స్ ఆఫ్ ఇండియా, సి.ఇ.జి.ఆర్ సంస్థల సర్వే ద్వారా,భారత దేశములోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఒకటిగా, గుర్తింపు పొందినట్లు తెలిపారు. ప్రముఖ మల్టీ నేషనల్ కంపెని ఇన్ఫోసిస్ వారు, 2022 సంవత్సరం ఇంజినీరింగ్ పూర్తి కాబోయే విద్యార్థులకు, వర్చువల్ పద్ధతి ద్వారా నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో, 51 మంది విద్యార్థులు ఎంపికైనట్లు, కళాశాల ప్రిన్సిపాల్ మొయిద వేణుగోపాలరావు తెలియజేశారు. ప్రాంగణ ఎంపికలలో ఎంపికైన విద్యార్థికి రు.3.60 లక్షల వార్షికవేతనము మరియు ఇతరఅలవెన్సులు లభిస్తాయని, కళాశాల ప్రాంగణఎంపికల అధికారి యన్.పూర్ణచంద్రరావు తెలి పారు. వీరికి రెండవ సంవత్సరం నుండి సి, సి ప్లస్ ప్లస్ పైథాన్, యాప్టిట్యూడ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లలో శిక్షణ ఇవ్వడం వలన ఈ ఎంపిక లను సాధించినట్లు తెలిపారు. ఇన్ఫోసిస్ కంపెనీ వారు, నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో, ఎంపికైన విద్యార్థులకు, సి.యస్.ఇ. విభాగాధి పతి డా.పి.హరిణి, ఇ.సి.ఇ విభాగాధిపతి డా.కె.జగదీష్ బాబు, ఇ.ఇ.ఇ ఇన్ చార్జి విభాగాధిపతి డా.యస్.వి.డి అనిల్ కుమార్, మెకానికల్ విభాగాధిపతి వి.లక్ష్మి నారాయణ, ఎం.సి.ఎ.విభాగాధిపతి డాక్టర్ సి.హరికిషన్, వివిధ విభాగాధిపతులు, మరియు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ చేయూత



మచిలీపట్నం, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 29: మచిలీపట్నంనియోజకవర్గ పరిధిలోని పెదయాదర గ్రామంలో ఇటీవల ఆకస్మికంగా మృతిచెందిన ఆటో కృష్ణ ప్రసాద్ కుటుంబాన్ని జనసేన పార్టీ ఇంఛార్జ్ బండిరామకృష్ణ పరామర్శించారు. పెదయాదర గ్రామ జనసైనికులు రూ 30,000వేలు జనసేన పార్టీ ఇంచార్జి బండి రామకృష్ణ మరో 20,000వేలరూ) మొత్తం 50,000వేలరూ నగదును భర్తను కోల్పోయిన బాధిత మహిళకు ఇంచార్జ్ బండి రామకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబంఅని తండ్రిని కోల్పోయిన బాధిత కుటుంబ పిల్లల చదువుల నిమిత్తం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద యాదర గ్రామ సర్పంచ్ గల్లా తిమోతి, నెలకుర్రు సర్పంచ్ బొమ్మసాని నరేష్, జిల్లా నాయకులు వంపుగడవలచౌదరి, జన్ను నాగరాజు ముళ్లపూడి వెంకట సుబ్బారావు, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు,పినిశెట్టివేణు, మైనార్టీ నాయకులు మహమ్మద్ సమీర్,బాజి పెద యాదర గ్రామ జనసైనికులు, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వావిలాలకి టిడిపి నాయకుల ఘన నివాళులు

సత్తెనపల్లి ప్రజాపాలన :ప్రముఖ స్వాతంత్ర సమర యోధులు, పద్మభూషణ్, సత్తెనపల్లి మాజీ శాసన సభ్యులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారి 19 వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వావిలాల ఘాట్



లో వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో పల్నాడుజిల్లా తెలుగుదేశంపార్టీ ఉపాధ్యక్షులు సయ్యద్ పెద కరముల్లా, పల్నాడుజిల్లా తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి పూజల వెంకట కోటయ్య, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిన్నాబోయిన వెంకట రాఘవ, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వరరావు, 29 వ వార్డు కౌన్సిలర్ షేక్ జాని బాషా, కోమెరపూడి సంగం డెయిరీ అధ్యక్షుడు యర్రా వెంకటేశ్వర రావు, రాంబో బుడే, పున్నయ్య నాయక్, బండారు నాగరాజు, పోతుగంటి నరసింహారావు, తోరటి వెంకట్రావు, చల్లా మస్తాన్ రావు, జయరావు, గాలి ఆంజనేయులు, దాదా నాయక్, తదితరులు పాల్గొన్నారు

## గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎం పి డి ఓ



పి గన్నవరం :ప్రజా పాలన ప్రతినిధి:పి.గన్నవరం మండలం లోని వాడ్రేవుపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పరిధిలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాల గురించి సచివాలయ ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్ లలో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు .

## స్పటిక లింగానికి అభిషేకం,పూర్వజన్మ సుకృతం: డాక్టర్.తాడివలస దేవరాజు



చీరాల, ఏప్రియల్ 29, ప్రజాపాలన : కాశీ నుండి తెచ్చిన స్పటిక శివలింగానికి, మాసశివరాత్రి రోజు పంచామృతాలతో అభిషేకం చేసే అదృష్టం దక్కటం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ యం.డి.,ప్రముఖ వైసిపి యువనేత డాక్టర్.తాడివలస. దేవరాజు అన్నారు. అమావాస్య ముందు రోజు మాస శివరాత్రి సందర్భంగా, కొత్తపేట ఓంకార క్షేత్రం దేవాలయం నందు, కాశీ నుండి తెచ్చి నటువంటి స్పటిక శివ లింగానికి, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు, విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలను, నియమ నిష్ఠలతో, అత్యంత భక్తి శ్రద్ధలతో, అర్చక స్వాముల వేద మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి కామేశ్వర శర్మ మాట్లాడుతూ, స్పటిక లింగం నకు అభిషేకం చేసినచో, ఆయువు, ఆరోగ్యం ఐశ్వర్యం, వంశం అభివృద్ధి చెందేలా ఆశీర్వాదములభి స్తుందని, ప్రతి నెలా మాస శివరాత్రి రోజున, ఓంకార క్షేత్రం దేవాలయం ముందు, స్పటిక లింగంకు అభిషేకం, పూజా కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని వెల్లడించారు. డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ, ఆ పరమ శివునికి, ఎంతో ఇష్టమైన మాసశివరాత్రి రోజున, ఓంకార క్షేత్రం నందు, శివుడికి పంచామృతాలతో, అభిషేకం చేసే, అవకాశం దొరకడం పూర్వజన్మ సుకృతమని, ఓంకారేశ్వర స్వామి ఉమామహేశ్వరి దేవతల అనుగ్రహంతో, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, ఆ శివుడిని వేడుకున్నట్లు తెలిపారు. అభిషేకం, పూజా కార్యక్రమాలలో అర్చకులు కారంచేటి నగేష్ , ఆలయ ప్రెసిడెంట్ గురు సత్యనారాయణ ,సెక్ర టరీ ఉప్పుగుండూరు రామకృష్ణ శర్మ ,ఆలయ కమిటీ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.

## నెరవేరనున్న కృష్ణాజిల్లా ప్రజల చిరకాల స్వప్నం: ఎమ్మెల్యే పేర్ని నాని



మచిలీపట్నం: కృష్ణాజిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన మచిలీపట్నం పోర్టు నిర్మాణం రాబోయే కొద్ది నెలలలో ప్రారంభం కానున్నట్లు మాజీ మంత్రి, మచిలీపట్నం శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య ( నాని ) ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ, మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి 2008లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారని 2019 ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికలకు ముందు చంద్రబాబు హయాంలో నవయుగ సంస్థ పనులు మొక్కుబడితంతుగా ప్రారంభించిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నవయుగ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకుందని ఈ క్రమంలో డిపిఆర్‌ను సవరించి టెండర్లు గడువు నాలుగుసార్లు పొడిగించిందని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగా నిధులు సమకూర్చి పోర్టు నిర్మాణ పనులు చేపట్టేందుకు సిద్ధమైందన్నారు. 2007 – 2008 సంవత్సరంలో మచిలీపట్నం పోర్టు నిర్మాణం కోసం ప్రజాభిప్రాయం సేకరించడం జరిగిందని, 2009 – 2019 మధ్యకాలంలో మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు జరగకపోవడంతో, పది సంవత్సరాలు కాలపరిమితి మాత్రమే పర్యావరణ అనుమతులు ఉంటాయి కనుక పర్యావరణ అనుమతులు మరోమారు తీసుకోవాల్సివచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించిన తర్వాత రెండు సంస్థలు మాత్రమే టెండర్లు దాఖలు చేసిందన్నారు. రివర్స్ టెండరింగ్ దశ సైతం పూర్తి కాబడి మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ కు గురువారం మచిలీపట్నం పోర్టు నిర్మాణపనులు లభించినట్లు తెలుస్తుందని, మచిలీపట్నం పోర్టును ఆంధ్రప్రదేశ్ మారీటైం బోర్డు , బ్యాంకుల రుణం సహాయంతో రాష్ట్ర ప్రభుత్వమే మచిలీపట్నం పోర్టు నిర్మించబడుతుందని ఎమ్మెల్యే పేర్ని నాని చెప్పారు.

## దశల వారీగా నియోజకవర్గ పనులు పూర్తి చేస్తాం: పేర్నినాని



మచిలీపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన :మచిలీపట్నం నియోజకవర్గంలోని అన్ని పనులను దశల వారీగా పూర్తి చేస్తామని మాజీ మంత్రి,మచిలీపట్నం శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన మచిలీపట్నం మండలం, పెదపట్నం గ్రామంలోని పలు అభివృద్ధిపనులకు శంకుస్థాపనలు, పూర్తయిన భవన నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ రూ.17.50 లక్షలతో వైయస్ఆర్ ఆరోగ్య కేంద్ర నిర్మాణంతో పాటు రైతు భరోసాకేంద్రం, సచివాలయం, ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే సిబ్బంది కోసం రూ.3 లక్షలతో మరుగుదొడ్ల సౌకర్యం, మౌలిక సదుపాయాల కల్పనకు శంకుస్థాపనలు చేశామన్నారు. వీటిని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేయడం జరిగిందన్నారు. రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గంలో ఉన్న గ్రామాలను దశల వారీగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గ్రామాల అభివృద్ధి కోసం అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు. ఆయన అంకిత బావానికి నియోజకవర్గ ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడిదేసి అనూష, మాజీ జడ్పీటీసీ లంకె వెంకటేశ్వరరావు,అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బొర్రా విఠల్, కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ జి.బాలజేసు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, వైయస్ఆర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రమ్య హత్యకేసులో నిందితునికి ఉరిశిక్ష హర్షణీయం:డీబీహెచ్ పీయస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్



నరసరావుపేట.ఏప్రిల్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) :బీటెక్ విద్యార్థిని రమ్య ను అత్యంత దారుణంగా హత్యచేసిన శశికృష్ణను ఉరితీయాలని శుక్రవారం కోర్టు తీర్పునివ్వడం హర్షణీయమని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ అన్నారు. ఈరోజు స్థానిక రొంపిచర్ల మండలం నల్లగార్లపాడులోని అంబేద్కర్ నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరం ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సాక్షిగా గుంటూరు నడిబొడ్డున జరిగిన అత్యంతకిరాతకంగా బీటెక్ విద్యార్థిని నల్లపు రమ్యను శశికృష్ణ తనను ప్రేమించలేదనే కారణంతో కత్తితో నడిరోడ్డులో పొడిచి చంపిన ఘటనలో నిందితుడైన శశికృష్ణకు ఈరోజు కోర్టులో ఉరిశిక్ష ఖరారు చేస్తూ తీర్పునివ్వడం హర్షణీయమని ఇలా తీర్పులు రావడం వలన నేరం చేయాలంటేనే ప్రజలు భయపడతారని మిగతా కేసులైన కోట అనూష,గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం తుమ్మలపాలెంలో వీరంకి తిరుపతమ్మపై మూకుమ్మడిగా అత్యాచారం జరిపి చంపిన నిందితులను విజయవాడ ప్రభుత్వాసుపత్రిలోని యువతిపై మూకుమ్మడిగా అత్యాచారం చేసిన నిందితులను చిలకలూరిపేట మండలం బొప్పూడిలో పసి బాలికపై అత్యాచారం జరిపిన తండ్రిని కి కూడా ఉరిశిక్ష వేసి న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాలని అన్నారు.

## మేడే వేడుకలకు సర్వం సిద్ధం



పీలేరు (ప్రజాపాలన ప్రతినిధి ) :కార్మిక సోదరులకు పండగ రోజైన మేడే వేడుకలను ఘనంగా నిర్వహించడానికి బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులందరూ శుక్రవారం జరిగిన సమావేశం లో ఏకగ్రీవంగా ఆమెదించారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆఫీస్ నుండి క్రాస్ రోడ్డు వరక్షు ఆ తరువాత క్రాస్ రోడ్డు నుండి ఎమార్వో ఆఫీస్ క్షు వరక్షు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ర్యాలీ మధ్యలో అంబేడ్కర్ ,ఫ్నలే ,గాంధీ విగ్రహాలక్షు ఫ్లులమాలలు వెయ్యనున్నట్లు కార్మిక సోదరులు,మేస్త్రిలు,కార్పెంటర్స్,ఎలక్ట్రీషియన్స్, పెయింటర్స్, వెల్డర్స్, బిల్డర్స్ అందరూ పాల్గొన్ని తమకీ ఇచ్చిన భాధ్యతలను సక్రమంగా నిర్వహించి మేడే కార్యక్రమాన్ని విజయవంతంగా చెయ్యాలని పిలుపునిచ్చారు.

## స్నేహిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓఎన్జీసీ సహకారంతో కుట్టు మిషన్ల పంపిణీ



పి గన్నవరం: ప్రజాపాలన ప్రతినిధి:అమలాపురానికి చెందిన స్నేహిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓఎన్జీసీ మరియు కె.జి బేసిన్ వారి సహకారంతో పి గన్నవరం మండలంలోని మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసే కార్యక్రమంలో పి గన్నవరం శాసనసభ్యులు కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ట్రైనింగ్ అయిన సభ్యులకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహిత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నారని ఇటువంటి మరెన్నో కార్యక్రమాలను చెయ్యాలని మా పిగన్నవరం ప్రజల తరుపు కోరుకుంటున్నానన్నారు. స్నేహలత స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ కుంచే స్వర్ణలత మాట్లాడుతూ ఆడవాళ్లు అన్ని రంగాల్లో ముందుండాలని కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న కుటీర పరిశ్రమల లాంటివి అలవర్చుకోవాలని అన్నారు. మా ఫౌండేషన్ ద్వారా పిగన్నవరం మండలంలోని 45 రోజులు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి 50 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మా ఫౌండేషన్ ద్వారా 2005 వ సంవత్సరం నుండి చాలామందికి వరదల సమయంలో కరోనా కష్టకాలంలో కూడా ఆరోగ్య పరంగానూ విద్యాపరంగానూ సేవలందిస్తున్నామని రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓఎన్జీసీ మేనేజర్ ఎం.వీ.మోహన్ రావు.కె.జి.బేసిన్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ డీ.సీ.ఎం కె.జి.బేసిన్ వి.వెంకన్న,పి గన్నవరం గ్రామపంచాయతీ సర్పంచ్ బొండాడనాగమణి,పి గన్నవరం మండల ప్రజాపరిషత్అభివృద్ధి అధికారి ఐ.ఇ. కుమార్,స్థానిక ఎంపీటీసీ సభ్యులను స్నేహిత స్వచ్ఛంద సేవా సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో స్నేహిత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## వార్డు అభివృద్ధికి కౌన్సిలర్ ప్రభాకరరావు కృషి ప్రశంసనీయం: మున్సిపల్ వైస్ చైర్మన్ రామసుబ్బులు



చీరాల, ఏప్రియల్ 29, ప్రజాపాలన : వార్డు అభివృద్ధికి, వార్డులోని సమస్యల పరిష్కారానికి, కౌన్సిలర్ ప్రభాకర్‌రావు చేస్తున్న కృషి ప్రశంసనీయమని, మున్సిపల్ వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు అన్నారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా, పాపరాజుతోట సచివాలయం పరిధిలో,16వ వార్డు కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ లో ముఖ్య అతిధిగా మున్సిపల్ వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు,గౌరవ అతిధిగా 18వ వార్డు కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య అలియాస్ ఉల్లిపాయల సుబ్బయ్య హాజరై య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరిశుభ్రత పాటించటం ద్వారా, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని పేర్కొన్నారు. వార్డు అభివృద్ధి కోసం, కౌన్సిలర్ ప్రభాకర్ రావు పడుతున్న తపన స్ఫూర్తిదాయకం అని, వార్డులోని సమస్యల పరిష్కారానికి, ప్రభాకర్రావు చేస్తున్న కృషిని వారు అభినందించారు. కార్యక్రమంలో,16వ వార్డు కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు, 18 వ వార్డు కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య మరియు పాపరాజు తోట సెక్రటరీలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# తప్పు అధికారులది.. శిక్ష అమాయక ప్రజలకు..

## టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ



గోకవరం ప్రజాపాలన విలేఖరి ఏప్రిల్ 29 : తప్పు ఒకరు చేస్తే ఫలితంగా శిక్ష మరొకరు అనుభవించాల్సి వచ్చింది అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు వివరాల్లోకి వెళితే తూర్పు గోదావరి జిల్లా, గోకవరం మండలం, అచ్యుతాపురం గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల సుమారు 3 వేల మంది జనాభాకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అచ్యుతాపురం నుండి గుమ్మల్లదొడ్డి ఐఓసీల్ కంపెనీ కి 33 కెవి విద్యుత్ లైన్లను ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. అసలు సమస్య ఇక్కడ ప్రారంభమైంది. సబ్ స్టేషన్ నుండి ఐఓసీల్ కంపెనీకి అర కిలోమీటర్ దూరమున్న దగ్గర మార్గాన్ని వదిలి, మూడు కిలోమీటర్ల దూరపు మార్గం ద్వారా ప్రతిపాదనలు విద్యుత్ శాఖ అధికారులు సిద్ధం చేస్తారు. దీనివల్ల సుమారు 10 కోట్ల రూపాయల అదనపు భారం ప్రజలపై పడుతుంది. తప్పుడు ప్రతిపాదనలు పంపిన విద్యుత్ శాఖ అధికారులను రక్షించడానికి వివిధ శాఖల అధికారులు ఏకమై గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేసన్తా, కర్కశంగా పోలీస్ ఫోర్స్ ఉపయోగిస్తూ, గ్రామం మధ్య నుంచి ప్రమాదకరంగా విద్యుత్ లైన్ల ఏర్పాటును చేస్తున్నారు. దీనిపై జనసేన పార్టీ జగ్గంపేట సమన్వయ కర్త పాఠంశెట్టి సూర్యచంద్ర తన భార్యతో కలిసి గత రెండు రోజులుగా ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ దీక్షా శిబిరానికి వచ్చి, పార్టీలకతీతంగా సూర్యచంద్ర దంపతులకు సంఘీభావాన్ని ప్రకటించారు. పోలీసులు దీక్షను భగ్నం చేస్తారనే సమాచారం ఉండడంతో సూర్య చంద్ర దంపతులు సమీపంలో ఉన్న అమ్మవారి గుడిలో తాళం వేసుకొని దీక్షను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, రాజకీయాలకతీతంగా బాధ్యతగల శాసన సభ్యుడిగా స్థానిక శాసన సభ్యుడు దగ్గరుండి సమస్యను పరిష్కరించడం మానేసి, తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడం దారుణం అన్నారు. ఇప్పటికైనా అధికార పక్షానికి చెందిన ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు పక్షాన నిలబడి, తగిన న్యాయం చేయాలని, లేనిపక్షంలో న్యాయస్థానం ఆచరించడం, తద్వారా గ్రామస్తులకు అండగా నిలబడటం తన ముందున్న మార్గమని జ్యోతుల నెహ్రూ తెలిపారు. కాగా విద్యుత్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు పనులను చురుగ్గా చేసుకుంటూ వెళుతున్నారు. అన్నారు .ఆయన వెంట మారిశెట్టి భద్రం గోకవరం టిడిపి మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ. అడపా భరత్ .ఉంగరాల గణేష్. టౌన్ ప్రెసిడెంట్ పోసిన ప్రసాద్. ఆకుల కాశి. ఉంగరాలు రాము. గునిపే భరత్. ఈది అశోక్. గుండా శివ ప్రసాద్ .సత్యం పెద్ద అబ్బులు నారా ప్రసాద్ .బాదంపూడి హర్షిత ప్రకాష్. వరసాల గుబ్బ రాజు బత్తుల సత్తిబాబు . పులపర్తి బుజ్జి.వెంకటపతి టిడిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: చీఫ్ విప్ ముదునూరి



నరసాపురం, ఏప్రిల్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) : నియోజకవర్గంలో మంచినీటికి 102 కోట్ల నిధులు పక్కా ప్రణాళికతో ఖర్చుబెడుతున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం నరసాపురం మండలం సరిపల్లి గ్రామం లంకరోడ్డు వద్ద జె.జె.ఎం నిధుల ద్వారా మంజూరు కాబడిన 30 లక్షల రూపాయలు, లిఖితపూడి గ్రామం ఎలిమెంటరీ స్కూల్ వద్ద 45 లక్షల రూపాయల నిధులతో పైప్ లైన్ల అభివృద్ధి పనుల నిర్మాణానికి శంకుస్థాపన చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలందరికీ పరిశుభ్రమైన మంచినీటిని అందించాలని నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలలో రూ. 30 కోట్లు, పట్టణంలో రూ. 62 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని ఆయన అన్నారు. ఈవేసవిలో టెండరు ప్రక్రియ పూర్తిచేసి వేగంగా పనులు ప్రారంభించి పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని అన్నారు. సరిపల్లి గ్రామంలో సుమారు 1 కోటి 5 లక్షలు, లిఖితపూడి గ్రామంలో 50 లక్షల రూపాయలను పైప్ లైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు ఖర్చు చేస్తున్నామని అన్నారు. శివారు ప్రాంతం కనుక మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్నామని అన్నారు. నిరుపయోగంగా ఉన్న మంచినీటి ట్యాంకులను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు. వేసవిలో మంచినీటి ఇబ్బందులు లేకుండా ముందస్తుచర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్, జడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఉంగరాల రమేష్, పోతురాజు వరలక్ష్మి, చిట్టిబాబు, గమిడి మధు, జేవీఆర్, చెన్నం వెంకట్రావు, మైలాబత్తుల కృష్ణంరాజు, శోభనరావు, వీరవల్లి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ ఏసు, జపాన్,%అ%తిరుమాని తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులు, పార్కుల సమగ్ర అభివృద్ధికి కృషి



సత్తెనపల్లి: ప్రజాపాలన :అభివృద్ధి పనులు, ఇతర అనుమతులలో పద్దతి, న్యాయబద్ధంగానే వ్యవహిస్తున్నామని..ఎవ్వరికీ దోచిపెట్టే ఉద్దేశ్యం లేదని రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం పురపాలక సంఘం చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఆయన ఎక్స్ అఫిషియోహోదాలో పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో జనసేన కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ బాలాజీ ఫ్రీ స్వీట్ దుకాణానికి సంబంధించి చేసిన ఆరోపణకు మంత్రివర్యులు పై విధంగా స్పందించారు. బాలాజీ దుకాణ యజమాని డిపాజిట్ చెల్లించాడని, నెలకు రూ.50 వేల అద్దె చెల్లిస్తున్నారని వివరించారు.ఇందులో దోచిపెట్టే ఉద్దేశ్యమేమీ లేదన్నారు. మా ప్రభుత్వ హయాంలో పద్దతి ప్రకారం, పారదర్శకంగానే పనులు చేస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ మేరీగ్రేస్ మాట్లాడుతూ ర్యాటిఫికేషన్ పేరుతో అత్యధిక అంశాలు చేరుస్తున్నారని, గతంలో చెరువు అభివృద్ధికి రూ.10 లక్షలకు పైగా కేటాయించారని ,ఇప్పుడు మరో రూ.20 లక్షలు కేటాయించారని ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అంబటి స్పందిస్తూ.. ప్రస్తుతం చెరువులో పూడిక తీతలు తీస్తున్నారని, తీసిన మట్టితో చెరువుకట్టల బలోపేతం చేయడం, చెరువు చుట్టూ ప్రహరీ, పెన్సింగ్ నిర్వహించి అక్రమంగా లోపలికి ప్రవేశించే అవకాశం లేకుండా ఒకే ఒక ద్వారం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పనులు పూర్తి అయిన తర్వాత చేపల పెంపకాన్ని ప్రోత్సహించి ట్రాక్, పార్క్ నిర్వహణకు అవసరమయ్యే నిధులను కొంత సమీకరించుకోవడానికి ఈ విధంగా అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సభలో ప్రవేశ పెట్టిన తర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అంబటి జలవనరుల శాఖామాత్యులుగా తొలిసారి కౌన్సిల్ సమావేశానికి రావడంతో చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, మున్సిపల్ నాయకులు సాంబశివరావు , కమీషనర్ షమ్మీ, వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్‌లు అచ్యుత శివప్రసాద్, అవ్వారు శ్రీను, రాజ్యలక్ష్మి, మాధవి, స్ధానిక నాయకులు మంత్రి వర్యులను ఘనంగా సత్కరించి, సన్మానించారు.



## ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన క్రింద 20 వేల 50 కోట్లతో మత్స్యకారుల ఆదాయ రెట్టింపు: డా.ఎల్.మురుగన్

మచిలీపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన :మత్స్య రంగ అభివృద్ధి, స్వయం సంవృద్ధి లక్ష్యాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్ వై) పథకం ప్రారంభించిందని ఇందులో భాగంగా 20 వేల 50 కోట్లతో మత్స్యకారుల ఆదాయ రెట్టింపు, స్వయం ఉపాధి కల్పన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కేంద్ర సమాచార ప్రసార, మత్స్య, పశుసంవర్ధక, డయిరీ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.ఎల్. మురుగన్ వెల్లడించారు.రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి సిదిరి అప్పలరాజు, మాజీ మంత్రి, బందరు శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని), జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి ఉప్పాల హారిక, నగర మేయర్ మెకావెంకటేశ్వరమ్మ, ఏపి మారిటైమ్ బోర్డు అధికారులతో కలసి కేంద్ర మంత్రి శుక్రవారం బందరు మండలంగిలకలదిండిలో ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. సముద్ర మొగ వద్దకు బోట్లో వెళ్లి డ్రెడ్జింగ్‌పనులు కేంద్ర మంత్రి పరిశీలించారు.ఈ సందర్భంగా మత్స్యకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆత్మ నిర్బర్ కార్యక్రమం క్రింద దేశంలో మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధికి(పీఎంఎంఎస్) 20,050 కోట్లతో మత్స్యకార కుటుంబ ఆదాయ రెట్టింపు, స్వయం ఉపాధి కల్పన,కార్యక్రమాలు, చేపల చెరువులు ఆర్ఎఎస్, బయోబ్లాక్ మరియు కెజ్ యూనిట్ల నిర్మాణం, చేపపిల్లల ఉత్పత్తి,పెంపకం, విక్రయ కేంద్రాల, సీతలీకరణ కేంద్రాల నిర్మాణంతో పాటు ఎఫ్ఎస్ఐడిఎఫ్ ద్వారా లబ్దిదారులకు మూడుశాతం వడ్డీ రాయితీ మౌలిక సదుపాయల కల్పనపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల్లో 36 శాతంతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. మత్స్య సంపద యోజన ప్రవేశ పెట్టాక దేశంలో ఫిషింగ్ హార్బర్లను అంతర్జాతీయ స్థాయిలతో ఐస్ ఫ్యాక్టరీ, ప్రోసెసింగ్, ప్యాకింగ్ వంటిఅత్యంత ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తద్వారా ఎగుమతుల పెంపుకు కృషి చేస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి సీదిరి అప్పల రాజు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధిసంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. సుదీర్ఘ సముద్రతీరం గల మన రాష్ట్రంలో అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందన్నారు. పాదయాత్రలో మత్స్యకారుల కష్టాలు, భాధలు స్వయంగా తెలుసుకుని మత్స్యకార కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

## అచ్యుతాపురం గ్రామలో ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా అధికారులు యంత్రాంగం అణిచివేత కి గురవుతున్న అమాయక ప్రజల



గోకవరం ప్రజా పాలన విలేఖరి 29 :గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామం సమీపంలో ఏర్పాటు చేసిన ఐ ఓ సి ల్ కి విద్యుత్ సరఫరా నిమిత్తం ఒక కిలోమీటర్ దూరం 33 కెవి ఎలక్ట్రికల్ లైన్ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. స్థానిక శాసనసభ్యులు అనుచరులు కోరిక మరియు స్వార్థం కోసం 33 కెవి ఎలక్ట్రికల్ విద్యుత్తు లైను మూడు కిలోమీటర్ల దూరం పొడిగించి అచ్యుతాపురం గ్రామం మీదుగా ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా, ప్రజల ప్రాణరక్షణకు విరుద్ధంగా 33 కెవి లైన్ నిర్మాణ వ్యయం మూడు కోట్ల రూపాయల నుంచి 13 కోట్ల రూపాయలకు పెంచుకునే దానికి ప్రభుత్వ పెద్దలు అధికారులు కుమ్మక్కై ప్రయత్నం చేస్తున్నారు. 33 కెవి లైన్ నిర్మాణానికి విరుద్ధంగా అచ్యుతాపురం గ్రామ ప్రజలు చేస్తున్న నిరాహారదీక్షకు జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మరోతి శివ గణేష్ మద్దతు తెలియజేశారు.సమస్య సంపూర్ణంగా పరిష్కారమయ్యే వరకు అచ్యుతాపురం గ్రామ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.సూర్య చంద్ర దంపతులను అభినందించారు ఈ కార్యక్రమంలో గోకవరం మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుర్రాల రత్నజీ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అవసరాల వెంకటాచల సుధాకర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం

### ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : రంజాన్ పండుగ త్యాగానికి ప్రతీక అని ఈ మాసంలో చేపట్టిన దీక్షలతో అల్లాహ్ ఆశీస్సులు సంపూర్ణంగా లభిస్తాయని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అజిత్ సింగ్ నగర్లోని షాదీఖానా నందు ముస్లిం సోదరులు సలీమ్, రహీమ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ ఎండి రుహుల్లాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా భావించే ఈ రంజాన్ మాసంలో వారితో కలిసి ప్రార్థనలు నిర్వహించడం, ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. మండుటెండలను కూడా లెక్కచేయకుండా కఠోర ఉపవాస దీక్షలను చేపట్టిన ముస్లిం సోదరులకు అల్లాహ్ శక్తినివ్వాలని ప్రార్థించారు. దివ్య ఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గం చూపే గ్రంథం అని మహ్మద్ ప్రవక్త చూపించిన మార్గాన్ని ప్రతీ ముస్లిం అనుసరించాలని సూచించారు. మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక చూపుతున్నారని మల్లాది విష్ణు అన్నారు. రాష్ట్రంలో ఐదుగురు ఉపముఖ్యమంత్రులలో ఒకరిని మైనార్టీ వర్గాల నుంచి ఎంపిక చేశారని వివరించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేశారని గుర్తుచేశారు. అల్లాహ్ దివ్య ఆశీస్సులతో సీఎం జగన్మోహన్ రెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, రాష్ట్రప్రభుత్వం అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీం, నాయకులు హఫీజుల్లా, శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, ఖాన్, షేక్ అమిద్, వలి, హనీఫ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్ళీ తెలుగుదేశం ప్రభుత్వం లోనే పోర్ట్ పనులు పూర్తి..

మచిలీపట్నం ఏప్రిల్ 29 ప్రజాపాలన : బందరు పోర్టు నిర్మాణానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లాపరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడిన మాజీ మంత్రి, మాజీ ఎంపీ..

కొనకళ్ల నారాయణ, మాజీ ఎంపీ, అప్పటి ఉద్యమాల ఫలితం వలనే పోర్టు సాధించాం.పోర్టు కావాలని 20 సంవత్సరాలుగా ఉద్యమాలు చేశాం. ఆ ఉద్యమాల ఫలితమే పోర్టు మచిలీపట్నంకు వచ్చింది. పోర్టు ప్రాజెక్టు పూర్తిచేయాలంటే డబ్బులు కావాలి. నిధులు కేటాయించక పోవడం వల్లే ఆలస్యమవుతూ వచ్చింది. మచిలీపట్నం అభివృద్ధి పోర్టు నిర్మాణంపై ఆధారపడి ఉంది.పోర్టుకు 14 సంవత్సరాలలో నిధులు తెచ్చిన ఏకైక ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అని కొనకళ్ల నారాయణ, అన్నారు.

కొల్లు రవీంద్ర, రాష్ట్ర మాజీ మంత్రి :

తెలుగు దేశం వల్లనే పోర్ట్ సాధ్యం పోర్టు రాకతో రవాణా కూడా విపరీతంగా పెరుగుతుంది. దుమ్ము, దూళితో పంటలు కూడా కొంత దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రత్యామ్నాయం ఆలోచించాలి. ఇళ్లు కోల్పోయిన వారికి కూడా పూర్తిగా నష్టపరిహారం చెల్లించాలి. టీడీపీ హయాంలో ల్యాండ్ పూలింగ్ చేశాం. వారికి మొత్తం కూడా వేస్తామన్నాం. కాని మూడేళ్లు అయిపోయింది. ఆ డబ్బులు కూడా ఇస్తేబాగుంటుంది. మా ప్రభుత్వం లో 350 కోట్ల నిధులు తీసుకుని వస్తే ఇప్పటి ప్రభుత్వం సరిగా టెండర్లు కూడాపిలవడం లేదు ఇంకా మంచినీళ్ల సమస్యపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, మాజీ మంత్రి, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్నివెంకట్రామయ్య(నాని), విజయమోహన్, ఇఇ, ఏపీ మారిటైమ్, మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత నోబుల్ థామస్, లంకా సూరిబాబు, ముడా చైర్మన్ బొర్రా గంగా భవానివిఠల్, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ అచ్చాబా, మాజీ మున్సిపల్ చైర్మన్ సిలార్ దాదా, జనసేన పార్టీ నేత బండి రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ లంకె వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రజలకు పాలన చేరువ చేయడానికే సిటిజన్ ఔట్ రీచ్ కార్యక్రమం: ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : ప్రజలకు ప్రభుత్వాన్ని మరింత చేరువ చేయడమే సిటిజన్ ఔట్ రీచ్ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణు అన్నారు. సిటిజన్ ఔట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలిసి జి.ఎస్.రాజు రోడ్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. సచివాలయాలలో అందిస్తున్న సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిటిజన్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఈ సందర్భంగా మల్లాది విష్ణు తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం, వాలంటీర్ల వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. సిటిజన్ ఔట్ రీచ్‌లో ప్రభుత్వం 543 సేవలు, పథకాలు పొందుపరిచిందని, వాటిని ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి నెలా ఆఖరి శుక్ర, శనివారాల్లో ప్రతి ఇంటికి సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు తప్పనిసరిగా వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల క్యాలెండర్ ను వివరించాలన్నారు. ఏయే నెలలలో, ఏయే పథకాలు అమలు అవుతాయనే విషయాలను ప్రజలకు క్లుప్తంగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దోనేపూడి శ్రీనివాస్, మైలవరపు రాము, కమ్మిలి రత్న, కూనపులి ఫణి తదితరులు పాల్గొన్నారు.



## "భళా తందనాన" కి రిలీజ్ డేట్ ఇదే.!




టాలీవుడ్ న్యూ ఏజ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్ లో ఒకరైన శ్రీ విష్ణు హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా "భళా తందనాన". దర్శకుడు చైతన్య తెరకెక్కించిన ఈ సినిమా రీసెంట్ గా ఈ నెల రిలీజ్ నుంచి తప్పుకుంది. అయితే మళ్ళీ మేకర్స్ ఆ కొత్త రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేస్తామని తెలిపిన సంగతి తెలిసిందే. మరి ఇప్పుడు ఈ సినిమా రిలీజ్ డేట్ పై కూడా ఈ కొద్ది లోనే మేకర్స్ ఈ మే 6న రిలీజ్ చెయ్యొచ్చని వినిపించాయి.మరి వాటిని నిజం చేస్తూ మేకర్స్ లేటెస్ట్ అఫీషియల్ అనౌన్సమెంట్ ఇచ్చేసారు. ఈ చిత్రాన్ని మే 6నే థియేటర్స్ లో రిలీజ్ చేస్తున్నామని ఇప్పుడు ఒక ఇంటెన్స్ పోస్టర్ తో అనౌన్స్ చేశారు. శ్రీ విష్ణు ఇపుడు మంచి కంటెంట్ తోనే ట్రై చేస్తున్నాడు మరి ఈ సినిమా ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ సినిమాకి మణిశర్మ సంగీతం అందివ్వగా క్యాథరిన్ హీరోయిన్ గా నటించింది. అలాగే వారాహి చలన చిత్రం వారు నిర్మాణం వహించారు.

## బాలయ్య "అన్ స్టాపబుల్" సీజన్ 2కి మొదలైన కసరత్తులు..!




నందమూరి బాలకృష్ణ తొలిసారి ఓటీటీ వేదిక ఆహాలో 'అన్ స్టాపబుల్' అనే టాక్ షోకి హోస్ట్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. వెండితెరపైనే కాకుండా బుల్లితెరపై కూడా బాలయ్య తనదైన మ్యానరిజంతో విశేషంగా ఆకట్టుకోవడంతో ఈ షో తొలి సీజన్ బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. దీంతో ఈ షో రెండో సీజన్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే తాజా సమాచారం ప్రకారం ఈ టాక్ షో రెండో సీజన్‌కి సంబంధించి సన్నాహాలను మొదలుపెట్టినట్టు తెలుస్తుంది. ఈ సారి సీజన్‌కి రాబోయే గెస్ట్ లను కూడా ఫైనల్ చేసే పనిలో పడ్డారట నిర్వాహకులు. ఈసారి గెస్ట్ లుగా చిరంజీవి, వెంకటేష్, ప్రభాస్, తదితరులు గెస్ట్ లుగా వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతుంది. అంతేకాదు ఈ సారి మరింత ఎంటర్‌టైనింగ్‌గా ఈ టాక్ షో ను నడపాలని నిర్వహకులు ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది.

## "ఆచార్య".. ఓన్లీ మెగా అభిమానులకు మాత్రమే !




మెగాస్టార్ చిరంజీవి సక్సెస్ ఫుల్ డైరెక్టర కొరటాల శివ కాంబినేషన్ లో వచ్చిన సినిమా 'ఆచార్య'. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, పూజా హెగ్డే కీలక పాత్రల్లో నటించారు. కాగా ఈ సినిమా ఈ రోజే ప్రపంచవ్యాప్తంగా విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఈ సినిమా ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం!

కథ:

ధర్మస్థలంలో అధర్మం రాజ్యం వెలున్న క్రమంలో ఆచార్య (చిరంజీవి) అక్కడకి వస్తాడు. ఎంతో ప్రసిద్ధి గాంచిన ధర్మస్థలి అప్పటికే బసవ(సోనూసూద్) చేతుల్లోకి వెళ్ళిపోతుంది. బసవ మరియు అతని మనుషులు చేసే అరాచకాలను ఆచార్య ఎలా అరికట్టాడు? అసలు ఆచార్యకి ధర్మస్థలికి ఉన్న సంబంధం ఏమిటి? ధర్మస్థలిలో నీలాంబరి (పూజా హెగ్డే) ఎవరి కోసం ఎదురు చూస్తూ ఉంటుంది? ధర్మస్థలి పక్కనే ఉన్న పాద ఘట్టం సంరక్షకుడిగా ఉన్న సిద్ద (రామ్ చరణ్) ఏమైపోయాడు? అసలు సిద్ధ ఎవరు? సిద్ధాకి ఆచార్యకి మధ్య ఉన్న బంధం ఏమిటి? చివరకు ఆచార్య ధర్మస్థలిలో ధర్మాన్ని ఎలా నిలబెట్టాడు? అనేది మిగిలిన కథ.

ప్లస్ పాయింట్స్:

అత్యంత భారీ అంచనాలతో భారీ చిత్రంగా వచ్చిన ఈ సినిమా, అద్భుతమైన ఎమోషన్స్ తో, విజువల్స్ తో మరియు భారీ తారాగణంతో తెరకెక్కించబడటమే ఈ సినిమాకి ప్రధాన ప్లస్ పాయింట్. మెగాస్టార్ చిరంజీవి తన పరిపక్వతమైన నటనతో ఈ చిత్రంలోనే ఉత్తమమైన నటనను కనబర్చారు. ముఖ్యంగా క్లిష్టమైన కొన్ని ఎమోషనల్ సన్నివేశాల్లో ఆయన తన మార్క్ నటనతో సినిమాకే హైలెట్ గా నిలిచారు. మరో కీలక పాత్ర సిద్ధగా కనిపించిన చరణ్ సినిమాకి మరో ప్రత్యేక ఆకర్షణ.చిరు చరణ్ ఒకే ఫ్రేమ్ లో కనిపించడం ఫ్యాన్స్ కి అతి పెద్ద విందు భోజనం. పైగా చిరు చరణ్ పాత్రల మధ్య జర్నీ అండ్ ఎలివేషన్స్ అద్భుతంగా అనిపించాయి. అలాగే చరణ్ క్యారెక్టర్ లోని షేడ్స్ చాలా బాగున్నాయి. ఇక చరణ్ సరసన కథానాయకగా నటించిన పూజా హెగ్డే తన స్క్రీన్ ప్రెజెన్స్ తో పాటుగా తన నటనతోనూ బాగా ఆకట్టుకుంది. చరణ్ పూజా హెగ్డే మధ్య కెమిస్ట్రీ కూడా బాగుంది. ఇక సినిమాలో నాజర్, అజయ్, తనికెళ్ల భరణి తమ పాత్రలకి పూర్తి న్యాయం చేశారు. అలాగే ఇతర పాత్రల్లో కనిపించిన మిగిలిన నటీనటులు కూడా తమ నటనతో ఆకట్టుకున్నారు. అదేవిదంగా మహేష్ బాబు వాయిస్ ఓవర్, చరణ్, చిరంజీవి నక్సలైట్లుగా కనిపించే విజువల్స్ మరియు క్లైమాక్స్ సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

మైనస్ పాయింట్స్:

భారీ అంచనాలతో వచ్చిన ఈ మెగా హై ఎమోషనల్ అండ్ యాక్షన్ ఎంటర్ టైనర్ విజువల్స్ పరంగా ఆకట్టుకున్నా.. కథనం పరంగా సినిమా స్థాయికి తగ్గట్టుగా లేదు. అలాగే ఫస్ట్ హాఫ్ లో మరియు సెకండాఫ్ లలో వచ్చే సాగదీత సీన్స్, బోరింగ్ ట్రీట్మెంట్, ఇంట్రస్ట్ గా సాగని మెయిన్ సీక్వెన్స్ స్ అదే విధంగా ముందుగానే అర్ధమయ్యే కొన్ని సన్నివేశాల సినిమాకి మైనస్ పాయింట్స్ గా నిలుస్తాయి.దర్శకుడు కొరటాల శివ సినిమాను ఆసక్తికరమైన విజువల్స్ తో నడిపినా.. స్లోగా సాగే సీన్స్ తో కొన్నిచోట్ల సినిమాని బాగా నెమ్మదిగా నడిపారు. అలాగే సెకెండ్ హాఫ్ లో కూడా కొన్ని సీన్స్ బాగా రొటీన్ గా సాగాయి. ముఖ్యంగా ఆ సీన్స్ లో ఇంట్రస్ట్ మిస్ అయింది. 90 కాలం నాటి వెరీ రెగ్యులర్ మేకింగ్ స్టైల్ తో ఆ సన్నివేశాలు ఉన్నాయి. మొత్తమ్మీద మెగా ఫ్యాన్స్ తో పాటు సాధారణ ఆడియన్స్ కి కూడా బాగా కనెక్ట్ అయ్యే ఎలిమెంట్స్ ఇంట్రస్టింగ్ గా ఉండి ఉంటే ఈ సినిమా పూర్తి సంతృప్తికరంగా ఉండి ఉండేది. కానీ అలా లేదు.

సాంకేతిక విభాగం:

ఈ సినిమాకు సంబంధించి సాంకేతిక విభాగం గురించి మాట్లాడుకుంటే.. సినిమాటోగ్రఫీ వర్క్ అద్భుతంగా ఉంది. సినిమాలోని యాక్షన్ సన్నివేశాలతో పాటు మిగిలిన సన్నివేశాలను కూడా కథాకథనాలకు అనుగుణంగా చాలా అందంగా చిత్రీకరించారు. మణిశర్మ సంగీతం సినిమాకి బాగా ప్లస్ అయ్యింది. ఎడిటింగ్ కూడా చాలా బాగుంది. అయితే సినిమాలో స్లోగా సాగే సీన్స్ ను సాధ్యమైనంత వరకు ట్రీమ్ చేసి ఉంటే.. సినిమాకి ప్లస్ అయ్యేది. పాటల పిక్చరైజేషన్ కూడా చాలా బాగుంది. నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. నిర్మాణ విలువులు అద్భుతంగా ఉన్నాయి.

తీర్పు:

అత్యంత భారీ అంచనాలతో వచ్చిన ఈ భారీ మెగా ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్.. ఆ అంచనాలను అందకోలేక పోయింది. కాకపోతే, మెయిన్ కథాంశం, చిరు చరణ్ ల నటన, వీరు కలిసి సాగిన సన్నివేశాలు, మెగాస్టార్ మెగా పవర్ స్టార్ స్క్రీన్ ప్రేజన్సీ బాగా ఆకట్టుకున్నాయి. అయితే, రొటీన్ సీన్స్ తో స్లోగా సాగే ప్లే, అక్కడక్కడ బోరింగ్ ట్రీట్మెంట్, ఇక బలం లేని మెయిన్ సీక్వెన్స్ స్.. ఈ సినిమాకి మైనస్ పాయింట్స్ గా నిలిచాయి. ఓవరాల్ గా ఈ చిత్రం ఆకట్టుకోలేకపోయింది.

## సైలెంట్ మోడ్ లో క్రేజీ హీరోయిన్..!



పక్కింటి అమ్మాయిలా కనిపించే నటి. హీరోయిన్ గా తొలి చిత్రంతోనే తెలుగు ప్రేక్షకుల్ని ఫిదా చేసేసింది. అద్భుతమైన నటనతోనే కాకుండా మెరుపుతీగలా మెస్మరైజ్ చేసే డాన్స్ తో స్టార్స్ ని సైతం ఔరా అనిపించింది. తన పక్కన డాన్స్ చేస్తే ఎక్కడ తేలిపోతామో అని స్టార్స్ ఫీలయ్యేలా చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. మెగాస్టార్ సైతం తనతో కలిసి స్టెప్పులేయాలని తన సినిమాలో ఓ నటి ంఎ జే య్ రా ల ని ముచ్చటపడ్డారంటే ఆమె ప్రత్యేకత ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆమె ఎవరో తెలిసిపోయింది కదూ యస్ సాయి పల్లవి. శేఖర్ కమ్మముల తెరకెక్కించిన 'ఫిదా' చిత్రంతో భానుమతి ఒక్కటే పీస్ హైబ్రిడ్ పిల్లా రెండు కులాలు రెండు మతాలు అంటూ హల్ చల్ చేసి తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకుంది. వెండితెరపై ఓ హీరోయిన్ లా కాకుండా మన పక్కింటి అమ్మాయే అనే ఫీలింగ్ ని ప్రతీ ప్రేక్షకుడిలోనూ కలిగించి వాళ్ల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుంది. అలాంటి క్రేజీ హీరోయిన్ ఉన్నట్టుండీ సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయింది. 2022 మొదలై 4 నెలలు పూర్తయినా ఇంత వరకు తెలుగులో మరో చిత్రాన్ని అంగీకరించకపోవడం గమనార్హం. 2021 లో బ్యాక్ టు బ్యాక్ రెండు చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సాయి పల్లవి. నాగచైతన్య హీరోగా శేఖర్ కమ్ముల తెరకెక్కించిన 'లవ్ స్టోరీ' నేచురల్ స్టార్ నాని డ్యుయెల్ రోల్ లో నటించిన 'శ్యామ్ సింగరాయ్' చిత్రాల్లో నటించింది. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాల్ని సొంతం చేసుకుని నటిగా సాయి పల్లవికి మంచి పేరు తెచ్చి పెట్టాయి. ఇదే ఊపులో సాయి పల్లవి నటించిన మరో చిత్రం 'విరాట పర్వం'. రానా హీరోగా నటించగా వేణు ఊడుగుల ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఉత్తర తెలంగాణ లో 90వ దశకంలో జరిగిన యదార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ మూవీని రూపొందించారు. సురేష్ ప్రొడక్షన్స్ డి. సురేష్ బాబు సమర్పణలో సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ స్థాయిలో నిర్మించారు. గత ఏడాది ఏప్రిల్ లో ఈ మూవీ విడుదల కావాల్సి వుంది. అయితే కరోనా కారణంగా రిలీజ్ అలస్యమవుతూ వచ్చింది. ఇక ఈ ఏడాది అయినా రిలీజ్ అనుకుంటే భారీ చిత్రాలు వుండంతో కుదరలేదు. ఇప్పటికీ ఈ సినిమా రిలీజ్ పై మేకర్స్ ఎలాంటి ప్రకటన చేయడం లేదు. ఓటీటీ లో ఈ మూవీని రిలీజ్ చేస్తున్నారంటూ వరుస కథనాలు వినిపిస్తున్నాయి.కానీ టీమ్ నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు. ఇదిలా వుంటే ఉన్నట్టుండీ సాయి పల్లవి సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోవడం 2022 మొదలై నాలుగు నెలలు పూర్తి చేసుకున్నా ఆమె మరో సినిమా అంగీకరించకపోవడంతో ఆమె అభిమానులు షాక్ కు గురవుతున్నారు. సాయి పల్లవి ఎందుకు సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయింది? .. సినిమాలు ఎందుకు అంగీకరించడం లేదు? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇటీవల మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'వేదాలం' రీమేక్ 'భోళా శంకర్' చిత్రంలో కీర్తి సురేష్ పాత్రలో చిరుకు సోదరిగా నటించమని ఆఫర్ ఇచ్చారు. పాత్ర తనకు నచ్చకపోవడంతో మెగాస్టార్ ఆఫర్ ఇచ్చినా సాయి పల్లవి సున్నితంగా తిరస్కరించింది. స్క్రిప్ట్ పాత్ర నచ్చితేనే సినిమాలు చేయాలని నిర్ణయించుకున్న సాయి పల్లవి ఆ కారణంగానే సినిమాలు అంగీకరించడం లేదని అంటున్నారు.


PAY BACK TO SOCIETY SNEHA CLUB

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :

| | | | |
|---|---|---|---|
| Hyderabad | 76600 27682, 7842106355 | Tirupathi | 94400 77239 |
| Visakhapatnam | 0891-2791205, 9246663046 | Bapatla | 94403 20562 |
| | 7660027696, 7660027664 | Ponnur | 99089 91763 |
| | | Cherukupalli | 79958 56068 |
| Vijayawada | 76600 27670, 900062111 | Karlapalem | 76600 27676 |

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com